

న్యూస్ బాక్స్

పోలీసులు ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉండాలి : సీపీ

పాలకుర్తి/అంతర్గాం/జ్యోతినగర్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు పోలీసులు నిత్యం అందుబాటులో ఉంటూ సేవలు అందించాలని రామగుండం పోలీస్ కమిషనర్ ఎం. శ్రీనివాస్ అన్నారు. గురువారం రామగుండం, అంతర్గాం, ఎన్టీపీసీ పోలీస్ స్టేషన్‌లను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ ఆవరణలో మొక్కలను నాటారు. ఆయనకు పోలీస్ సిబ్బంది ఘన స్వాగతం పలికారు. కమిషనర్ అండర్ఇన్వెస్టిగేషన్‌లో ఉన్న సీడీ ఫైల్స్‌ను, పెండింగ్ ట్రయల్‌లో ఉన్న సీడీ ఫైల్స్‌ను, గ్రేవ్ కేసెస్‌లలో ఉన్న సీడీ ఫైల్స్‌ను, పెండింగ్ ఫైల్స్‌ను పరిశీలించారు. నిందితుల అరెస్టు, రౌడీషీటర్‌ల వివరాలను, రోడ్డు ప్రమాదాల నివారణకు, నేరాల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలను స్థానిక ఎస్ఐలను అడిగి వివరాలను సేకరించారు. పోలీస్‌స్టేషన్ కు వచ్చే వారితో అధికారులు, సిబ్బంది మర్యాదపూర్వకంగా ప్రవర్తించాలన్నారు. ఆయన వెంట పెద్దపల్లి డీసీపీ చేతన, గోదావరిఖని ఏసీపీ మడత రమేష్, రామగుండం సీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్ఐ సంధ్యారాణి, ఎన్టీపీసీ ఎస్ఐ ఉదయ్‌కిరణ్, అంతర్గాం ఎస్ఐ వెంకటేష్ తదితరులు ఉన్నారు.

ఏసీఎల్‌ను సన్మానించిన నేతలు

జ్యోతినగర్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి) : రామగుండం అసిస్టెంట్ లేబర్ కమిషనర్ (సెంట్రల్) ఎం.డి.యూసుఫ్‌ను గురువారం ఎన్టీపీసీ జేఏసీ నాయకులు సన్మానించారు. ఇటీవలే ఏసీఎల్‌గా బదిలీపై వచ్చిన యూసుఫ్‌ను జేఏసీ నాయకులు చిలుక శంకర్, నాంసాని శంకర్, నాగభూషణం, ఆర్.రాయ మల్లయ్య ఘనంగా సత్కరించారు.



ఎల్లంపల్లి ప్రాజెక్టు బ్యాక్ వాటర్‌కు అడ్డంగా పోసిన భారీ అడ్డుకట్ట



ప్రాజెక్టు చెరువుల్లో చేపల వేట



'ఎల్లంపల్లి' భూములు కబ్జా

- 200 ఎకరాల్లో చేపల చెరువుల ఏర్పాటు
- ప్రాజెక్టు బ్యాక్ వాటర్‌కు అడ్డుగా మట్టి కట్టలు
- ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యంపై ప్రభావం

గోదావరిఖని, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు భూములు కబ్జాకు గురవుతున్నాయి. ప్రాజెక్టు కోసం ప్రభుత్వం సేకరించిన భూముల్లో దర్జాగా చేపల చెరువులు ఏర్పాటు చేశారు. అంతర్గాం మండలం పొట్యాల నుంచి ముర్మూర్ వరకు సోమనపల్లి కేంద్రంగా 200 ఎకరాల్లో చేపల చెరువులు నిర్మించారు. పొట్యాల, సోమనపల్లి, ఆకెనపల్లి, ముర్మూర్ రెవెన్యూ శివారుల్లోని శ్రీపాద ప్రాజెక్టు భూముల్లో ఈ దందా కొన సాగుతోంది. అయినా ప్రభుత్వ యంత్రాంగం పట్టించు కున్న దాఖలాలు లేవు. ఆక్రమణదారులు ప్రాజెక్టు బ్యాక్ వాటర్ ప్రాంతాన్ని కబ్జా చేసి పెద్దగా మట్టి కట్టలు పోసి 30 నుంచి 40 చెరువులను నిర్మించారు. శ్రీపాద ప్రాజెక్టు నుంచి పైప్‌లైన్లు వేసి చెరువుల్లోకి నీటిని పంపింగ్ చేసుకుంటున్నారు. అందుకు అవసరమైన కరెంటును పరిసరాల్లోని ట్రాన్స్‌కో విద్యుత్ స్తంభాల ద్వారా అక్రమ కనెక్షన్‌తో వాడుకుంటున్నారు.

రైతులకు ప్రభుత్వం ఉచితంగా ఇచ్చే విద్యుత్ కనెక్షన్ల నుంచి ఈ కరెంటును వాడు కుంటున్నారు. ప్రాజెక్టు నీళ్లలోనే త్రీ ఫేజ్ కరెంటు వైర్లను వేసి ప్రమాదకర పరిస్థితుల్లో విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్నారు. ప్రాజెక్టు నీరు చేపల చెరువుల వైపు రాకుండా అడ్డంగా ఆన కట్టలు కట్టారు. దీంతో శ్రీపాద ప్రాజెక్టు బ్యాక్ వాటర్ కిలోమీటర్ వెనకకు ఆపి పెట్టారు. 20టీఎంసీల నిల్వ సామర్థ్యం ఉన్న శ్రీపాద ప్రాజెక్టు నీటిమట్టం నిల్వ కొలతలను ప్రభావితం చేసే స్థాయిలో ఈ వ్యవహారం సాగుతున్నది. ఇంత జరుగుతున్నా రామగుండంలోని శ్రీపాద ప్రాజెక్టు కార్యాలయం అధికారులు చూసీ చూడ నట్టు వ్యవహరిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చెరువుల పరిరక్షణకు చర్యలు చేపడుతున్నా శ్రీపాద ప్రాజెక్టు భూములు ఆక్రమణకు గురవుతున్నా పట్టించుకున్న వారే కరువయ్యారు. రామ గుండం నుంచి పొట్యాలకు వెళ్లే ప్రధాన రోడ్డు మార్గానికి కేవలం కిలోమీటరు దూరంలోనే ఈ చేపల చెరువులు ఉన్నాయి. పైగా ముర్మూర్ శ్రీపాద పంప్‌హౌస్ వెనక, ముందు ఈ చేపల చెరువులు ఉన్నాయి. చేపల చెరు వుల మధ్య భారీ వాహనాలు తిరిగేలా రోడ్లను సైతం ఏర్పాటు చేసుకున్నారు. పంప్‌హౌస్ వద్ద నిలబడి చూస్తే ఈ తతంగమంతా కనిపిస్తుంది. కానీ ప్రాజెక్టు అధికారులు ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఈ చేపల చెరువుల్లో ఏటా రూ.100కోట్ల నుంచి రూ.150 కోట్ల వ్యాపారం సాగుతున్నదని సమాచారం. పది మంది స్థానికేతరులు ఈ చెరువులను గుత్తా పట్టి వేల టన్నుల చేపల ఉత్పత్తి చేస్తున్నారు. శ్రీపాద ప్రాజెక్టు భూముల పక్కనే భూముల కలిగిన రైతుల వద్ద ఎకరం, రెండు ఎకరాలు లీజు పద్ధతిన అగ్రిమెంట్లు చేసుకుని, దాన్ని అడ్డం పెట్టుకుని ప్రాజెక్టు భూముల్లో చేపల చెరువులు ఏర్పాటు చేశారు. రామగుండం మున్సిపల్ పరిధిలోని వందలాది చికెన్ ..

మిగతా 8లో

యాసంగిలో సన్నాల సాగుపై రైతుల ఆసక్తి

- జిల్లాలో విత్తనాలు, ఎరువులకు కొరత లేదు
- నాలుగు విడతల్లో రూ. 455.50 కోట్ల రుణ మాఫీ
- జిల్లా వ్యవసాయ శాఖ అధికారి దోమ ఆదిరెడ్డి

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)



రాష్ట్ర ప్రభుత్వం గడిచిన సీజన్‌లో సన్న రకం వరి పంటను సాగుచేసే రైతులను ప్రోత్సహించేందుకు క్వింటాలు ధాన్యానికి రూ.500 చొప్పున ఇచ్చే బోనస్‌ను యాసంగి సీజన్‌లోనూ ఇస్తామని ప్రకటించడంతో జిల్లాలో రైతులు సన్నాల సాగుపై ఆసక్తి కనబరుస్తున్నారని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి దోమ ఆదిరెడ్డి తెలిపారు. జిల్లాలో విత్తనాలు, ఎరువులకు కొరత లేదని, నాలుగు విడతల్లో 455.50 కోట్ల రుణ మాఫీ అయ్యిందని, రైతు బీమా పథకం ఎప్పటికప్పుడే క్లైయిమ్‌లు పరిష్కారం అవుతున్నాయని, రైతు భరోసా, ఫసల్ బీమా పథకం అమలుపై ప్రభుత్వం నుంచి ఇంకా ఎలాంటి ఆదేశాలు రాలేదని పేర్కొన్నారు. గురువారం 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆదిరెడ్డి వివరాలను వెల్లడించారు.

ఆంధ్రజ్యోతి: ఈసీజన్‌లో ఎంత విస్తీర్ణంలో పంటలు సాగు కానున్నాయి?

డీఏవో: జిల్లా వ్యాప్తంగా 2,22,442ఎకరాల్లో వివిధ రకాల పంటలను రైతులు సాగు చేయనున్నారు. ఇందులో అత్యధికంగా ఎప్పటిలాగానే వరి పంట 2,02,000 ఎకరాల్లో, 16వేల ఎకరాల్లో మొక్కజొన్న, 1200ఎకరాల్లో కూరగాయలు, ఇతర పంటలను సాగు చేసేందుకు రైతులు వరినార్లు పోస్తున్నారు.

ఆంధ్రజ్యోతి: ఈ సీజన్‌లో కూడా రైతులు సన్నాలు సాగు చేస్తున్నారా?

డీఏవో: అవును. ప్రభుత్వం ఈ సీజన్‌కు కూడా సన్నాలకు బోనస్ ఇస్తామని ప్రకటించడంతో రైతులు సన్నాల సాగుపై ఆసక్తి చూపుతున్నారు. సాధారణంగా ప్రతి యాసంగి సీజన్‌లో విత్తనోత్పత్తి కోసం మాత్రమే 30 వేల ఎకరాల్లో సన్నాలు సాగు చేస్తారు. మిగతా మొత్తం దొడ్డు రకం పంటనే వేస్తారు. బోనస్ ఇస్తుండడం వల్ల సీడ్ కాకుండా రైతులు 70 వేల ఎకరాల్లో సన్న రకం వరి పంటను వేస్తున్నారు.

ఆంధ్రజ్యోతి: సాగు నీటికి ఏమైనా కొరత ఉందా?

డీఏవో: జిల్లాలో సాగునీటికి డోకా లేదు. చెరువులు, కుంటలు, వ్యవసాయ బావులు, బోరుబావుల్లో పుష్కలంగా నీళ్లున్నాయి. శ్రీపాద ఎల్లంపల్లి, శ్రీరాంసాగర్ ప్రాజెక్టుల్లో పూర్తిస్థాయిలో నీళ్లున్నాయి. ప్రధానంగా ఎస్సారెస్పీ కింద లక్షా 82 వేల ఎకరాల ఆయకట్టు భూములు ఉన్నాయి. పంట కోతల వరకు సాగు నీటి సరఫరా లేకపోవడంతో రైతులు ఇప్పటికే వరినార్లు పోశారు. వరి నాట్లు ఈసారి సంక్రాంతికి ముందే పూర్తి కానున్నాయి.

ఆంధ్రజ్యోతి: సరిపడా విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉన్నాయా?

డీఏవో: రైతులు సాగు చేసే పంటలకు 67061 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరం ఉంటాయని అంచనా వేశాం. ఇందులో 3,700 టన్నుల యూరియా, 4,322 టన్నుల డీఏపీ, 4,175 టన్నుల పొటాష్, 599 టన్నుల సూపర్ ఫాస్పేట్, 20.965 టన్నుల కాంప్లెక్స్ అవసరం ఉంటాయి. నెలనెలా ఎరువులు జిల్లాకు సరఫరా అవుతున్నాయి.

ఆంధ్రజ్యోతి: ఎంత మంది రైతులకు రుణ మాఫీ అయ్యింది?

డీఏవో: రాష్ట్ర ప్రభుత్వం ఏకకాలంలో 2లక్షల రూపాయల వరకు నాలుగు విడతల్లో 60,619 రైతులకు 455 కోట్ల 50 లక్షల రూపాయల రుణ మాఫీ సొమ్మును రైతుల ఖాతాల్లో జమ చేసింది.

ఆంధ్రజ్యోతి: రూ.2లక్షలకు పైగా రుణాలు తీసుకున్న వాళ్లు ఎందరు? ఇంకా అర్హులైన వారెందరున్నారు?

డీఏవో: జిల్లాలో రెండు లక్షల రూపాయలకు పైగా రుణాలు తీసుకున్న రైతులు 12,971 మంది ఉన్నారు. వీళ్లు 124 కోట్ల రూపాయల వరకు రుణాలు పొందారు. ఒకవేళ ప్రభుత్వం వీరికి రుణమాఫీ చేస్తే మాత్రం ఫ్యామిలీ గ్రూపింగ్‌లో కొంత రైతులు పోనూ 9 వేల మంది రైతులకు రుణ మాఫీ అయ్యే అవకాశాలున్నాయి. 2 లక్షల వరకు 12మంది వరకు రైతులు ఉన్నారు. సాంకేతిక కారణాల వల్ల వారి వివరాలను సరిచేసి ప్రభుత్వానికి పంపించాం. వారికి కూడా రుణ మాఫీ అయ్యే అవకాశాలు లేకపోలేదు.

ఆంధ్రజ్యోతి: రైతు బీమా పథకం ద్వారా సక్రమంగా అమలవుతున్నదా?

డీఏవో: రైతుబీమాకు సంబంధించి ఎప్పటికప్పుడు క్లైయిమ్‌లు పరిష్కారం అవుతున్నాయి. 2018లో పథకం ప్రారంభమైన నాటి నుంచి వివిధ కారణాల వల్ల 2028మంది రైతులు మృతిచెందారు. ఇద్దరు రైతులకు సంబంధించిన సూసైడ్ ఫైనల్ రిపోర్టు రాకపోవడం వల్ల పెండింగులో ఉన్నాయి. ఈఏడాదికి సంబంధించి 22కేసుల డాక్యుమెంటేషన్ ఇంకా పూర్తికాలేదు. వెంటవెంటనే డాక్యుమెంట్లను సంబంధిత రైతు కుటుంబాల నుంచి తెప్పిం చుకుని పంపిస్తున్నారు. రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నాం.

ఆంధ్రజ్యోతి: రైతు భరోసా, ఫసల్ బీమా పథకం ఈ సీజన్ నుంచి అమలవుతుందా?

డీఏవో: రైతు భరోసా పథకం, ఫసల్ బీమా యోజన పథకాల అమలుకు సంబంధించి ప్రభుత్వం నుంచి ఇప్పటివరకు ఎలాంటి ఉత్తర్వులు కానీ, ఆదేశాలు కానీ రాలేదు.

గాయత్రి విద్యానికేతన్‌లో సంగీత విభావరి

పెద్దపల్లి కల్చరల్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : పెద్దపల్లి పట్టణంలోని గాయత్రి విద్యానికేతన్‌లో గురువారం హార్ట్ బీట్ ఫౌండేషన్ ఫర్ ది విజువల్లీ ఇంపైర్డ్, హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో సంగీత విభావరి నిర్వహించారు. విద్యా సంస్థల చైర్మన్ అల్లెంకి శ్రీనివాస్, కరస్పాండెంట్ రజనీశ్రీనివాస్, ప్రిన్సిపాల్ విజయ్, రజియుద్దీన్, ఉపాధ్యాయ బృందం, ఫౌండేషన్ నిర్వాహకులు, పాల్గొన్నారు.

పకడ్బందీగా ఇందిరమ్మ ఇళ్ల సర్వే : కలెక్టర్



జిల్లా కేంద్రంలో జరుగుతున్న సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్



జూలపల్లిలో సర్వేను పరిశీలిస్తున్న జడ్పీ సీఈవో నరేందర్

పెద్దపల్లిటౌన్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ ఇళ్ల యాప్ ద్వారా జిల్లాలో దరఖాస్తు చేసుకున్న దరఖాస్తుల సర్వే పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష సంబంధిత అధికారులను సూచించారు. గురువారం పట్టణంలోని అమర్‌నగర్ చౌరస్తా వద్ద 35వ వార్డులో జరుగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను కలెక్టర్ పరిశీలించారు. సర్వేపై దరఖాస్తుదారులకు ముందస్తు సమాచారం అందించాలని, ప్రజలు సైతం అవసరమైన డాక్యుమెంట్లను సిద్ధం చేసుకొని సర్వే కోసం వచ్చే ఎన్యూమరేటర్‌లతో సహకరించాలని సూచించారు. ప్రతిరోజు నిర్దేశించుకున్న లక్ష్యం మేరకు ఎన్యుమరేటర్లు ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తు సర్వే పూర్తి చేయాలని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల సర్వే ప్రక్రియలో ఎటువంటి పొరపాట్లు రావడానికి వీలులేదని కలెక్టర్ తెలిపారు. ఈ తనిఖీలలో కలెక్టర్ వెంట పెద్దపల్లి మున్సిపల్ కమిషనర్ వెంకటేష్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు

● జూలపల్లి (ఆంధ్రజ్యోతి) : మండలకేంద్రంలో గురువారం పంచాయతీ కార్యదర్శి ముజీబ్, అధికారులు నిర్వహిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను జడ్పీ సీఈవో నరేందర్ పరిశీలించారు. అనంతరం మండలపరిషత్ కార్యాలయంలో అధికారులతో సమావేశమయ్యారు. ప్రభుత్వ పథకాలు అర్హులైన పేదప్రజలకు అందేలా అధికారులు కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో సర్వేలో ఎంపీడీవో పద్మజ, ఎంపీవో అనిల్‌రెడ్డి, పలువురు సిబ్బంది పాల్గొన్నారు

● పెద్దపల్లి రూరల్ (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పకడ్బందీగా చేపట్టాలని ఎంపీడీవో శ్రీనివాస్ అన్నారు. గురువారం మండలంలోని రాఘవపూర్‌లో చేపడుతున్న సర్వేను ఎంపీడీవో పరిశీలించారు. అంతకుముందు డీఎల్‌పీవో వేణుగోపాల్ పరిశీలించారు. వెంట పంచాయతీ కార్యదర్శి రవి, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను పర్యవేక్షించాలి : మేయర్ అనీల్‌కుమార్

కోల్‌సిటీ, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): రామగుండం నగరపాలక సంస్థ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించేలా పర్యవేక్షణ చేయాలని మేయర్ అనీల్ కుమార్ కార్పొరేషన్ అధికారులను ఆదేశించారు. గురువారం కార్పొరేషన్ కార్యాలయంలో టీయూఎఫ్ఐడీసీ, 15వ ఆర్థిక సంఘం, ఎస్‌డీఎఫ్ నిధులతో చేపడుతున్న పనుల గురించి సమీక్షించారు. ముఖ్యమంత్రి మంజూరు చేసిన రూ.20కోట్ల నిధులకు సంబంధించి త్వరితగతిన అంచనాలు రూపొందించి టెండర్లు నిర్వహించాలన్నారు. ముఖ్య కూడళ్ల అభివృద్ధి, సెంట్రల్ లైటింగ్ పనుల్లో వేగం పెంచాలని, లక్ష్మీనగర్, కళ్యాణ్‌నగర్‌లలో ప్రజలకు ఇబ్బంది కలుగకుండా సాధ్యమైనంత వరకు పనులు పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో ఎస్ఈ శివానంద్, అసిస్టెంట్ కమిషనర్ రాయలింగు, ఈఈ రామన్, అధికారులు పాల్గొన్నారు.

పోలీసులు కొట్టారనే అవమానంతో..

యువకుడి ఆత్మహత్యాయత్నం

- ప్రాణాపాయ స్థితిలో నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స
- ఆందోళనలో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు
- మెరుగైన చికిత్స అందించాలన్న మంత్రి శ్రీధర్‌బాబు



రాజ్‌కుమార్ ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుంటున్న మంత్రి శ్రీధర్‌బాబు

మంథని, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : పోలీసుల కొట్టారన్న అవమానంతో మంథనికి చెందిన శీలం రాజ్‌కుమార్ అనే యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ప్రాణాపాయ స్థితిలో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో రాజ్‌కుమార్ అత్యవసర విభాగంలో చికిత్స పొందుతున్నాడు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు బుధవారం రాత్రి నిమ్స్ ఆసుపత్రికి వెళ్లి బాధితుడి ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను ఆరా తీశారు. మెరుగైన వైద్య సేవలు అందేలా చూడాలని సూచించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి చికిత్స సంబంధించి అండగా ఉంటానని ధైర్యం చెప్పారు.

● ఆలస్యంగా వెలుగులోకి..

మంథని మున్సిపల్ పరిధి శ్రీపాదకాలనీ ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద ఈనెల 6న, 7న సాయంత్రం శీలం రాజ్‌కుమార్, హమాలీల మధ్య ఘర్షణ జరిగింది. హమాలీలు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రాజ్‌కుమార్‌ను పోలీసులు స్టేషన్‌కు తరలించి రాత్రి అక్కడే ఉంచుకోవడంతో పాటు లాఠీలతో కొట్టారని తల్లిదండ్రులు రాజేశ్వరి, దేవేందర్‌లు ఆరోపిస్తున్నారు. ఈనెల 8న ఉదయం తనను రాత్రి పోలీసులు కొట్టారని, తన సెల్‌ఫోన్‌లాకున్నారని, విషయాన్ని బయట ఎవరికి చెప్పవద్దని బెదిరింపులకు గురిచేశారని రాజ్‌కుమార్ తమ ముందు వాపోయాడని వారు పేర్కొంటున్నారు. పోలీసులు కొట్టిన అవమానభారాన్ని తట్టుకోలేక ఈనెల 8న తన ఇంట్లో ఉన్న రాజ్‌కుమార్ సాయంత్రం 6 గంటల సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడని, కోమాలో ఉన్న రాజ్‌కుమార్ పరిస్థితి ప్రమాదకరంగా ఉండటంతో హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రికి తరలించామన్నారు.

రాజ్‌కుమార్‌ను పోలీసులు కొట్టలేదు..

- రమేష్, ఎస్ఐ, మంథని

శ్రీపాదకాలనీలో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన రాజ్‌కుమార్‌ను నేను, పోలీసులు కొట్టలేదు. మేము కొట్టినట్లు వస్తున్న ఆరోపణల్లో నిజంలేదు. ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద హమాలీలకు, రాజ్‌కుమార్‌కు మధ్య జరిగిన గొడవపై హమాలీలు ఇచ్చిన ఫిర్యాదుపై రాజ్‌కుమార్‌ను స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశాం. రాజ్‌కుమార్ ఆత్మాహత్యాయత్నం తర్వాత అతని తండ్రి దేవేందర్ స్టేషన్‌లో హమాలీలుపై ఫిర్యాదు చేయడంతో వారిపై కూడా కేసు నమో దు చేశాం. మేము కేసు నమోదు చేసిన 24 గంటల తర్వాత ఈ సంఘటన చోటు చేసుకుంది. పోలీసుల దాడి కారణంగా ఈ సంఘటన జరిగిందని జరుగు తున్న ప్రచారంలో నిజం లేదు.

అంబేద్కర్‌పై అమిత్‌షా వ్యాఖ్యలను నిరసిస్తూ...

వామపక్ష, దళిత సంఘాల ఆధ్వర్యంలో రాస్తారోకో



నిరసన తెలుపుతున్న దళిత, కమ్యూనిస్టు నాయకులు

కళ్యాణ్‌నగర్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌పై కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ గురువారం మున్సిపల్ టీ జంక్షన్ వద్ద దళిత సంఘాలు, వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీబీజీకేఎస్ నాయకుడు మాదాసు రామమూర్తి, వామపక్షాల నాయకులు కనకరాజు, యాకయ్య, ఐ కృష్ణ, జూపాక శ్రీనివాస్, కాంపెల్లి సతీష్, గౌతం గోవర్దన్, వేల్పుల కుమారస్వామి, సారయ్య, నరేష్, పులి మోహన్, ఆరెళ్లి పోషం, మహేశ్వరి, వెంకన్న, రేణుక, తిరుమల, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. సీపీఎం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. మహేశ్వరి, యాకయ్య, మెండె శ్రీనివాస్, సారయ్య, భాగ్య, వాణి, మహేశ్వరి, నర్సయ్య పాల్గొన్నారు. సీఐటీయూ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాజ్యాంగ నిర్మాతపై అమిత్‌షా వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్టు అధ్యక్ష,కార్యదర్శులు తుమ్మల రాజారెడ్డి, మంద నర్సింహారావు చెప్పారు. మెండె శ్రీనివాస్, రాజమౌళి, సారయ్య, నరహరి, మల్లేష్, శ్రీకాంత్, రవి, నవీన్ కుమార్ పాల్గొన్నారు.

● కోల్‌సిటీటౌన్ (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను అవమానించే విధంగా పార్లమెంట్ సమావేశాల్లో మాట్లాడిన కేంద్ర మంత్రి అమిత్ షాను వెంటనే బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తూ ఆలిండియా అంబేద్కర్ యువజన సంఘం, ఎస్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం గోదావరిఖనిలో దిష్టిబొమ్మ దహనం చేశారు. స్థానిక మార్కండేయకాలనీలో చౌరస్తాలో అమిత్‌షా దిష్టిబొమ్మ దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఆలిండియా అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాంపెల్లి సతీష్, నాయకులు దుర్గా ప్రసాద్, శ్రీకాంత్, శివాజీ తతదిరులు పాల్గొన్నారు.

● మంథని (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రధాన చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహానికి ప్రజా సంఘాల నేతలు గురువారం క్షీరాభిషేకం చేశారు. పార్లమెంట్‌లో కేంద్ర హోం మంత్రి అమిత్‌షా అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం పట్ల వారు నిరసన వ్యక్తం చేశారు. అమిత్‌షా తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

● జూలపల్లి (ఆంధ్రజ్యోతి) : రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను కించపరిచేలా అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షాను పదవి నుంచి వెంటనే బర్తరఫ్ చేయాలని అంబేద్కర్ సంఘం నాయకుడు మామిడిపెల్లి కాంతయ్య మాదిగ, మానుమండ్ల శ్రీనివాస్‌మాదిగలు కేంద్ర ప్రభుత్వాన్ని డిమండ్ చేశారు. కేంద్రంలోని బీజేపీ నరేంద్రమోదీ ప్రభుత్వం కేవలం దళిత, బడుగు బలహీన వర్గాల ఓటు బ్యాంకు రాజకీయాల కోసమే పనిచేస్తున్నారని వారికి అంబేద్కర్‌పై ఏమాత్రం గౌరవం లేదని వారు మండిపడ్డారు.

నేడు డయల్ యువర్ డీఎం

కళ్యాణ్‌నగర్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని, పెద్దపల్లి పట్టణ, పరిసర ప్రాంతాల ప్రయాణికుల సమస్యల పరిష్కారం కోసం శుక్రవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు గోదావరిఖని డిపో మేనేజర్ ఎం నాగభూషణం తెలిపారు. ప్రయాణికుల సమస్యలను, సలహాలు, సూచనలు స్వీకరించేందుకు ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు డయ ల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. ప్రయణికులు తమ సలహాలను 9959225922 నంబర్‌కు ఫోన్ చేసి తెలియజేయాలని కోరారు.

● మంథని, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రయాణిలకు నుంచి సూచనలు, సలహాలు స్వీకరించడానికి స్థానిక ఆర్టీసీ డిపోలో శుక్రవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డీఎం శ్రావణ్‌కుమార్ గురువారం తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి 12 గంటలకు నిర్వహించే ఈకార్యక్రమంలో ప్రయాణికులు సెల్ నంబర్ 7382825923 కాల్ చేసి తమ అసౌకర్యాలు, ఇబ్బందులు తెలియజేయాలని ఆయన కోరారు.



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీహర్ష చిత్రంలో జిల్లా విద్యాశాఖ అధికారి మాధవి

ప్రాథమిక విద్య పటిష్టానికి కృషి

- విద్యార్థుల్లో పఠనం, గణిత సామర్థ్యాలు పెంచేందుకు చర్యలు..
- కలెక్టర్ కోయ శ్రీహర్ష

8

రాష్ట్రంలో క్రీడాకారులకు ఉజ్వల భవిష్యత్తు

- అదనపు కలెక్టర్ వేణు
- సుల్తానాబాద్‌లో సీఎం కప్ జిల్లా స్థాయి పోటీలు ప్రారంభం..

8



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న అదనపు కలెక్టర్ వేణు

సమస్యలు పరిష్కరించరూ..

- రేషన్ డీలర్లకు అందని గౌరవ వేతనం
- సక్రమంగా జమకాని కమీషన్
- నెలంతా కష్టపడినా ఫలితం ఉండడం లేదని ఆవేదన





హుజూరాబాద్‌రూరల్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రేషన్ డీలర్లు సమస్యలతో సతమతమవుతున్నారు. నెల రోజులు కష్టపడితే ఏమీ మిగలడం లేదని డీలర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏళ్లుగా నెలకొన్న సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఎన్నికల హామీల్లో భాగంగా కాంగ్రెస్ రేషన్ డీలర్లకు గౌరవ వేతనం కల్పిస్తామని మాటిచ్చింది. ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడిచినా అది కార్యరూపం దాల్చలేదు.

● మినీ సూపర్ మార్కెట్లుగా...

ఉమ్మడి రాష్ట్రంలో అమ్మహస్తం పథకం అమలు జరిగింది. బియ్యంతో పాటు చక్కెర, పప్పులు, నూనె ఇలా తొమ్మిది నిత్యావసర వస్తువులు రేషన్ షాపు ల్లో ఇచ్చేవారు. ఇది డీలర్లకు కాస్త లాభసాటిగానే ఉండేది. రాష్ట్ర విభజన అనంతరం బీఆర్ఎస్ ప్రభు త్వం వచ్చాక అమ్మహస్తం పథకం నిలిచిపోయింది. కేవలం రేషన్ షాపులు బియ్యం పంపిణీకే పరిమిత మయ్యాయి. తిరిగి నిత్యా వసరల విక్రయం జరి పేలా కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డీలర్లు కోరుతున్నారు. రేషన్ షాపులను మినీ సూపర్ మార్కెట్లుగా మారిస్తే న్యాయం చేసినట్లు అవుతుందంటున్నారు. రేషన్ డీలర్లకు కమీషన్ డబ్బులు ప్రతినెల క్రమంగా అందటం లేదు. రెండు, మూడు నెలలకు కమీషన్ డబ్బులు అకౌంట్లలో జమ అవుతున్నాయి. నెలవారీ డబ్బులు అందకపోవడంతో డీలర్లు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రతి నెల క్రమంగా డబ్బులు ఇవ్వాలనే డిమాండ్ సైతం ప్రభుత్వం పట్టించుకోవడం లేదని డీలర్లు వాపోతున్నారు.

● నామమాత్రంగా కమీషన్

ఎంత కష్టం చేసినా చివరకు మిగిలేది రిక్తహస్తాలే అని డీలర్లు ఆవేదన చెందుతున్నారు. అన్‌లోడింగ్ చార్జీలు సైతం తామే భరించడంవల్ల ఏమీ మిగలడం లేదుంటున్నారు. ఒక్కోసారి తామే అదనంగా భరించాల్సిన దుస్థితి ఏర్పడుతుందనేది డీలర్ల వాదన. ఒక డీలరు వంద క్వింటాళ్ల బియ్యం బస్తాలను తీసుకుంటే రవాణా, డ్రైవర్, కూలీ మొత్తం రెండువేల రూపాయల వరకు భరించాల్సి వస్తోంది. వంద క్వింటాళ్ల బియ్యాన్ని విక్రయిస్తే క్వింటాల్‌కు 140రూపాయల చొప్పున 14వేల రూపాయల కమిషన్ డీలర్‌కు వస్తుంది. అందులో నుంచి షాపు అద్దె, విద్యుత్ చార్జీలు, హమాలీ ఖర్చులు చెల్లిస్తే ఏమీ మిగలడ లేదని డీలర్లు చెబుతున్నారు. అన్ లోడింగ్ చార్జీలను ప్రభుత్వమే భరించాలని డీలర్లు డిమాండ్ చేస్తున్నారు. బస్తాకు రెండు కిలోల బియ్యం తక్కువ వస్తున్నాయి. ఈ క్రమంలో ఈ భారాన్ని కూడా మోయాల్సి వస్తోందని డీలర్లు చెబుతున్నారు. క్వింటాల్ బియ్యం బస్తా కచ్చితమైన తూకంతో సరఫరా చేయాలని డిమాండ్ చేస్తున్నారు. షాపు రెన్యూవల్ శాశ్వత ప్రతి పాదికన జరగాలని, ప్రతి నెల 1వ తేదీ లోగానే బియ్యం సరఫరా చేయాలని, ప్రభుత్వం రేషన్ షాపుల కోసం భవనాలను నిర్మించి ఇవ్వాలని డీలర్లు కోరుతున్నారు.

● ప్రభుత్వం స్పందిస్తే సమస్యకు పరిష్కారం



డీలర్ల సంఘం అధ్యక్షుడు, హుజూరాబాద్. రేషన్‌షాపు డీలర్ల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలి. మా సమస్యలపై ప్రభుత్వం మాన వతా దృక్పథంతో స్పందించాలి. గౌరవ వేతనం మూడు వేల రూపాయలు కల్పించాలి. డీలర్ మృతి చెందితే తక్షణమే ఆర్థిక సహాయంగా ప్రభుత్వం 30వేల రూపాయలు ఆ కుటుంబానికి అందించాలి. అన్‌లోడింగ్ ఖర్చులు ప్రభుత్వం భరిస్తే మాకు కాస్త వెసులు బాటు ఉంటుంది.

- సొల్లు అశోక్, మండల రేషన్ మండల రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడు, హుజూరాబాద్

వృద్ధుడిని నుంచి డబ్బులు అపహరణ

వేములవాడ, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): బ్యాంక్ ఖాతా నుంచి డ్రాచేసిన డబ్బులను లెక్కపెట్టి ఇస్తానని నమ్మబలికి వృద్ధుడి వద్ద నుంచి ఏడువేల రూపాయలు అపహరించిన ఘటన వేములవాడ పట్టణంలోని యూనియన్ బ్యాంక్ ఆవరణలో గురువారం జరిగింది. వేములవాడ మున్సిపాలిటీ పరిధిలోని శాత్రాజ్‌పల్లి గ్రామానికి చెందిన గుడిసె మాణిక్యం అనే వృద్ధుడు యూనియన్ బ్యాంక్‌లోని తన ఖాతాలో నుంచి రూ. 20 వేలు డ్రా చేశాడు. వృద్ధుడిని గమనించిన ఓ వ్యక్తి అతనికి మాయమాటలు చెప్పి డబ్బులు మళ్లీ లెక్కిస్తానని తీసుకుని డబ్బులు లెక్కిస్తున్నట్లు నటించి అందులోంచి ఏడు వేల రూపాయలు మాయం చేసి మిగతా సొమ్ము చేతిలో పెట్టి అక్కడి నుంచి పరారయ్యాడు. అనుమానం వచ్చిన వృద్ధుడు మళ్లీ డబ్బులు లెక్కించగా 13 వేల రూపాయలు మాత్రమే ఉండడంతో మోసపోయానని గ్రహించి విషయాన్ని బ్యాంక్ మేనేజర్‌కు తెలిపాడు. బ్యాంక్‌లోని సీసీ కెమెరాలను పరిశీలించారు. డబ్బులు ఎత్తుకుని వెళ్లిన దొంగ సమీపంలోని ఓ వైన్ షాప్ దగ్గర ఉండడం గమనించిన బ్యాంక్ ఉద్యోగి రాజేష్ అతన్ని పట్టుకొని పోలీసులకు అప్పగించాడు. చాకచక్యంగా దొంగను పట్టు కొని పోలీసులకు అప్పగించిన రాజేష్‌ను బ్యాంక్ సిబ్బంది అభినందించారు.

సెల్‌టవర్ నిర్మాణం నిలిపివేయాలి

మల్యాల, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): మల్యాల కొత్తపేట ప్రాంతంలో ఏర్పాటు చేస్తున్న ప్రైవేట్ సెల్‌ఫోన్ టవర్ నిర్మాణ పనులు నిలిపివేయాలని కోరుతూ స్థానిక మహిళలు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. ఇళ్ల మధ్య సెల్‌టవర్‌తో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. పంచాయతీ ఈవో శ్రీకాంత్‌తో తమ ఆగ్రహం వెలిబుచ్చారు. పనులు నిలిపివేయనున్నట్లు ఈవో తెలుపడంతో మహిళలు వెనుదిరిగారు.

తన ఇంటికి దారి ఇవ్వాలని

సెల్‌టవర్ ఎక్కి నిరసన





సెల్‌టవర్ ఎక్కిన మల్లేష్

కాల్వశ్రీరాంపూర్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఇంటికి దారి ఇవ్వడంలేదని ఓ వ్యక్తి సెల్‌టవర్ ఎక్కి నిరసన వ్యక్తం చేసిన సంఘటన మండలంలో పందిళ్లలో గురువారం జరిగింది. సమస్య పరిష్కరిస్తామని పెద్దపల్లి ఏసీపీ గజ్జి కృష్ణ హామీతో కొండపర్తి మల్లేష్ సెల్‌టవర్ నుంచి కిందికి దిగాడు. తమ ఇంటికి వెళ్లడానికి తన అన్న దారి ఇవ్వడంలేదని మనస్తాపం చెందిన మల్లేష్ సెల్‌టవర్ ఎక్కాడు. విషయం తెలుసుకున్న ఎస్సై వెంకటేష్ సంఘటన స్థలానికి చేరుకొని మల్లేష్‌కి నచ్చచెప్పి కిందికి దించే ప్రయత్నం చేశారు. పెద్దపల్లి ఏసీపీ గజ్జి కృష్ణ సమస్య పరిష్కరిస్తామని ఫోన్‌ద్వారా తెలపడంతో బాధితుడు మల్లేష్ టవర్ పైనుంచి కిందికి దిగాడు.

ఇసుక అక్రమ రవాణపై కొరడా

- ఒకే నంబర్ ప్లేట్‌తో ఇసుక తరలింపు
- మూడు లారీల పట్టివేత

సిరిసిల్ల క్రైం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇసుక అక్రమ రవాణాపై పోలీసులు కొరడా ఝులిపిస్తున్నారు. లారీలకు ఒకే నంబర్ ప్లేటుతో ఇసుకను తరలించడంపై నిఘా పెట్టారు. వేములవాడ, సిరిసిల్ల ప్రాంతాల్లో అక్రమంగా రవాణా చేస్తున్న మూడు ఇసుక లారీలను పట్టుకున్నారు. 24 గంటల్లో సిరిసిల్లలో రెండు, వేములవాడలో ఒక ఇసుక లారీని పట్టుకొని ఐదుగురిపై కేసు నమోదు చేశారు. సిరిసిల్ల పట్టణం కలెక్టరేట్ చౌరస్తా వద్ద అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న లారీని పోలీసులు తనిఖీలు చేశారు. ఈ తనిఖీల్లో ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా లారీ నంబర్ టీజీ 23 0639కు బదులుగా టీజీ 23టీ 0456 అనే నంబర్ ప్లేట్లు అమర్చి అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారని బహిర్గతమైంది. రెండు లారీల్లో ఒకే నంబర్ ప్లేట్‌పై ఇసుకను అక్రమంగా రవాణా చేయడమే కాకుండా లారీ నంబర్ ప్లేట్లు మార్చిన పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్‌కు చెందిన లారీ డ్రైవర్ బుద్దుల రాజేందర్(30), లారీ యజమానులైన బోయిన్ పల్లి మండలంలోని నీలోజుపల్లి గ్రామానికి చెందిన ఎర్ర నాగరాజు, కొదురు పాక గ్రామానికి చెందిన రాకం స్వాతిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సీఐ కెకృష్ణ తెలిపారు. అక్రమంగా ఇసుక రవాణా చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి



మీస జగదీష్(ఫైల్)

సుల్తానాబాద్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): లూజ్ వైర్లను సరిచేసే యత్నంలో ఓ యువకుడు విద్యుదాఘతానికి గురై మృతిచెందిన సంఘటన సుల్తానాబాద్ మండ లంలోని రేగడిమద్దికుంటలో చోటు చేసుకుంది. రామునిపల్లి గ్రామానికి చెందిన మీస చంద్రయ్య, లక్ష్మీ దంపతులు, కుమారుడు మీస జగదీష్‌లు తమ వ్యవసాయ క్షేత్రంలో కూర గాయలు సాగు చేసుకుంటున్నారు. గురువారం సమీప విద్యుత్ వైర్లు కిందకు వేలాడుతుండగా వాటిని సరి చేసే క్రమంలో సమీపంలో ఉన్న 11 కేవీ విద్యుత్ వైరుకు తాకి జగదీష్(24) విద్యుదాఘాతానికి గురయ్యాడు. వెంటనే కిందపడిపోగా కుటుంబ సభ్యులు అతన్ని సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే చనిపోయినట్లు డాక్టర్లు నిర్ధారించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

ఇద్దరు మహిళల ఆత్మహత్య

శంకరపట్నం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం ఎరడపల్లి గ్రామంలో ఓ మహిళ ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. జంగిలి దేవేంద్ర (27) గురువారం ఇంట్లో భర్త పరశురాములు లేని సమయంలో దూలానికి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. కాగా మానకొండూర్ మండలం శంషాబాద్ గ్రామానికి చెందిన దేవేంద్రకు ఎరడపల్లి గ్రామానికి చెందిన జంగిలి పరశురాములతో 8ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి 14 నెలల కూతురు ఉంది. దేవేంద్ర మృతికి సంబంధించి కారణాలు తెలియరాలేదు.

హుజూరాబాద్‌లో ..

హుజూరాబాద్‌రూరల్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని బుడగ జంగాల కాలనీకి చెందిన గంధ రామక్క అనే మహిళ బుధవారం అర్ధరాత్రి ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడగా గురువారం వెలుగులోకి వచ్చింది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గందం రామక్క ఉంటున్న ఇంటిని కొండబత్తిని మురళి జప్తు చేస్తాడమోనన్న మనోవేదనకు గురై ఇంట్లో అందరూ నిద్రిస్తున్న సమయంలో చీరెతో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. తన భార్య మృతికి కొండ బత్తిని మురళి, అంకుసులే కారణమంటూ మృతురాలి భర్త సారయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

శంకరపట్నం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం వంకాయగూడెం గ్రామ శివారులోని కరీంనగర్-వరంగల్ జాతీయ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తాడ్వాయి మండలం బీరెల్లి గ్రామానికి చెందిన ఎనిమిది మంది ట్రాలీ ఆటోలో వేములవాడ దైవదర్శనానికి వెళ్తున్నారు. ఈ క్రమంలో వంకాయగూడెం వద్దకు చేరుకోగానే ఎదురుగా వస్తున్న గ్రానైట్ లారీ ఆటో ట్రాలీని ఢీకొట్టింది. ఈ ఘటనలో ట్రాలీ ఆటోలో ప్రయాణిస్తున్న ఆనంద్ వర్ధన్, సూర్యప్రకాష్, ఇషాని అనే ముగ్గురు గాయపడ్డారు. గాయపడిన వారిని ఆస్పత్రికి తరలించారు. పోలీసులు వివరాలు నమోదు చేసుకున్నారు.

వాహనాల చోరీ కేసులో ఏడాది జైలు

వేములవాడ, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాలను దొంగలించిన కేసులో ఇద్దరు వ్యక్తులకు వేములవాడ జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి జ్యోతిర్మయి ఏడాది జైలు శిక్షతో పాటు రెండు వేల రూపాయల జరిమానా విధించినట్లు వేములవాడ పట్టణ సీఐ వీరప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వేములవాడ పట్టణానికి చిట్టిమల్ల అంజయ్య, జగిత్యాలకు చెందిన ఉబిది గంగస్వామి తమ ద్విచక్ర వాహనాలు చోరీకి గురయ్యాయని గత జూన్ నెలలో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు విచారణ జరిపి దొంగతనానికి పాల్పడిన చందుర్తి మండలం బండపల్లి గ్రామానికి చెందిన షైక్ మహబూబ్, బొప్పాపూర్‌కు చెందిన అనరసి కిష్టయ్య అనే నిందితులను పట్టుకొని రిమాండ్ తరలించామని సీఐ వివరించారు. విచారణ అధికారి అంజయ్య కోర్టులో చార్జీ షీటు దాఖలు చేయగా సీఎంఎస్ ఎస్ఐ రవీందర్ నాయుడు ఆధ్వర్యంలో కోర్టు కానిస్టేబుల్ సురేశ్ సాక్షులను ప్రవేశపెట్టారు. ప్రాసిక్యూషన్ తరపున విక్రాంత్ కేసును వాదించారని, పూర్వాపరాలు పరిశీలించిన న్యాయమూర్తి నేరస్తులకు ఒక సంవత్సరం జైలు శిక్షతో పాటు రెండు వేల రూపాయల జరిమానా విధించిందని సీఐ తెలిపారు.

జనరల్ ఆసుపత్రి సూపరెండెంట్ సరెండర్

- ఉత్తర్వులు జారీ చేసిన కలెక్టర్

జగిత్యాల, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరెండెంట్ డాక్టర్ రాములును డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్‌కు సరెండర్ చేస్తూ గురువారం కలెక్టర్ సత్యప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆసుపత్రి సూపరెండెంట్ రాములు ఎటువంటి అనుమతి లేకుండా విధులకు గైర్హాజరుకావడం, విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో చర్యలు చేపట్టారు. జనరల్ ఆసుపత్రిలో 9 తొమ్మిది జనరల్ బాడీ సమావేశాలు నిర్వహించగా, కేవలం మూడు సమావేశాలకు హాజరయ్యారని, ఆరు పర్యాయాలు జడ్పీ జనరల్ బాడీ సమావేశాలకు గైర్హాజరైనట్లు గుర్తించారు. ఆసుపత్రిలో మందులు అందుబాటులో ఉంచడంలో నిర్లక్ష్యం వహించడం, మాతా శిశు కేంద్రంలో ఆహార పదార్థాల కాంట్రాక్టులో అవకతవకలకు పాల్పడడం, గత నెలలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని సందర్శించిన సమయంలో సూపరింటెండెంట్ రాములు సెలవు మంజూరుకాకుండానే గైర్హాజరైనట్లు గుర్తించడం, నిజామాబాద్‌లో ప్రైవేటు ఆసుపత్రి నిర్వహిస్తున్నట్లు ఆరోపణలున్న నేపథ్యంలో డీఎంఈకి సరెండర్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.

పాఠశాల పరిసర ప్రాంతాలు శుభ్రంగా ఉంచండి

● కలెక్టర్ సత్యప్రసాద్



పెద్దాపూర్ గురుకులంలో పరిశీలిస్తున్న కలెక్టర్ సత్యప్రసాద్



జాతీయ రహదారిపై ఆందోళన చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

మెట్‌పల్లి రూరల్, డిసెంబర్, 19 (ఆంధ్రజ్యోతి) : గురుకుల పాఠశాల పరిసర ప్రాంతాల్లో పాములు, పురుగులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, పిచ్చి మొక్కలు తొలగించి పరిసరాల పరిశుభ్రంగా ఉంచాలని కలెక్టర్ సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. మెట్‌పల్లి మండలంలోని పెద్దాపూర్ గురుకుల పాఠశాలలో మళ్లీ పాము కాటు కలకలం రేపడంతో విషయం తెలుసుకున్న కలెక్టర్ గురువారం పాఠశాలలో పర్యటించారు. బుధవారం రాత్రి గురుకులంలో ఎనిమిదవ తరగతి చదువుతున్న ఓంకారి అఖిల్ పాము కాటుకు గురికాగా మరో విద్యార్థి బోడ యశ్వంత్ గురువారం ఉదయం అస్వస్థతకు గురయ్యాడు. ఇద్దరిని కోరుట్ల ఆసుపత్రికి తరలించి తల్లిదండ్రులకు సమాచారం అందించారు. ప్రస్తుతం ఇద్దరు విద్యార్థులు కోరుట్ల పట్టణంలోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. కలెక్టర్ సత్యప్రసాద్ అస్వస్థతకు గురైన విద్యార్థులను పరిశీలించి ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్నారు. విద్యార్థులకు మెరుగైన చికిత్స అందించాలని వైద్యులకు సూచించారు. అనంతరం గురుకుల పరిసరాలు, విద్యార్థులు పడుకునే బెడ్‌లు, తరగదులు, మరుగుదొడ్లు క్షుణంగా ఆర్డీవో శ్రీనివాస్‌తో పాటు అధికారులతో కలిసి పరిశీలించారు. యశ్వంత్ పాము కాటుకు గురయ్యాడా లేదా ఏదైనా విషకీటకం కుట్టిందా అనేది మెడికల్ కాలేజి వారితో మాట్లాడి వివరాలను సేకరిస్తామన్నారు. కాగా వైద్యులు పరిశీలించి పాము కాదని నిర్ధారించి చికిత్స అందించారు. డిప్యూటీ డీఎం హెచ్‌వో శ్రీనివాస్, మెడికల్ వైద్యాధికారి అంజిత్‌రెడ్డిలు యశ్వంత్‌ను పరిశీలించి ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. విధుల్లో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యార్థులు, తల్లిదండ్రులు ఎలాంటి ఆందోళన చెందవద్దన్నారు. అధికారుల వెంట మెట్‌పల్లి ఆర్డీవో శ్రీనివాస్, తహసీల్దార్ శ్రీనివాస్, డీఎస్పీ రాము లు, పోలీసు, వైద్యాధికారులు, సిబ్బంది ఉన్నారు.

పాఠశాలను మరో చోటికి తరలించండి

● జాతీయ రహదారిపై తల్లిదండ్రుల ఆందోళన

పెద్దాపూర్ గురుకుల కళాశాల, పాఠశాలను మరో చోటికి తరలించాలని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చేపట్టారు. గురువారం గురుకుల సమీపం లోని జాతీయ రహదారిపై బైఠాయించి విద్యార్థుల ప్రాణాలను కాపాడాలని ఐదు గంటలకు పైగా ఆందోళన చేపట్టారు. కలెక్టర్ వచ్చి పాఠశాలను మరో చోటికి తరలిస్తామని హామీ ఇచ్చేంత వరకు ఇక్కడి నుంచి వెళ్లమని బైఠాయించారు. విషయం తెలుసుకున్న మెట్‌పల్లి ఆర్డీవో శ్రీనివాస్, డీఎస్పీ రాములు సంఘటన స్థలంకు చేరుకుని సర్ది చేప్పే ప్రయత్నం చేసినా వారు వినలేదు. సంఘటన స్థలానికి అడిషనల్ కలెక్టర్ లత వచ్చి విద్యార్థుల తల్లిదండ్రులతో కమిటీ ఏర్పాటు చేసి సమస్యలు పరిష్కరిస్తామని అధికారుల దృష్టికి తీసుకెళ్తామని సర్దిచెప్పడంతో ఆందోళన విరమించారు.

పెద్దాపూర్ గురుకులంలో మరో విద్యార్థికి అస్వస్థత

మెట్‌పల్లి రూరల్/కోరుట్ల, డిసెంబర్, 19 (ఆంధ్రజ్యోతి) : జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలంలోని పెద్దాపూర్ గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థి బోడ యశ్వంత్ గురువారం అస్వస్థతకు గురయ్యాడు. యశ్వంత్ గురుకుల పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. గురువారం ఉదయం స్నానం చేస్తుండగా చేయి నొప్పిగా ఉందని అక్కడే ఉన్న తోటి విద్యార్థులకు తెలిపాడు. దీంతో వారు వెంటనే పాఠశాల సిబ్బందికి తెలుపడంతో చికిత్స నిమిత్తం యశ్వంత్‌ను కోరుట్ల ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి యాంటీవీనమ్ ఇంజక్షన్ ఇచ్చి వైద్యం అందిస్తున్నారు.

● బుధవారం రాత్రి, గురువారం ఉదయం అస్వస్థతకు గురైన ఓంకార్ అకిల్, బోడ యశ్వంత్‌లు కోరుట్ల పట్టణంలో ప్రైవేట్ అసుపత్రిలో చికిత్స పొందుతుండగా కలెక్టర్ సత్యప్రసాద్ వారిని పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని సూచించారు.

ప్రిన్సిపాల్ సస్పెన్షన్

గురుకుల కళాశాల, పాఠశాల ప్రిన్సిపల్ మాధవిలతను సస్పెండ్ చేస్తున్నట్లు కలెక్టర్ సత్యప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. ఒకరోజు వ్యవధిలో ఇద్దరు విద్యార్థులు అస్వస్థతకు గురైన సమయంలో విద్యార్థులను ఆసుపత్రికి తరలించడంలో, విద్యార్థుల తల్లిదండ్రులతో వ్యవహరించిన తీరు, జరిగిన ఘటనల గురించి ఉన్నతాధికారులకు తెలపడంలో విచారణ చేపట్టారు. గురుకుల ఆవరణలో పారిశుధ్య నిర్వహణలో ప్రిన్సిపాల్ నిర్లక్ష్యంగా వ్యవహరించారనే తెలుపుతూ సస్పెన్షన్ చేస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేశారని అధికారులు తెలిపారు.

మత్స్యకారుల వలకు చిక్కిన కొండచిలువ



అర్కండ్లలో వలలో చిక్కిన కొండచిలువ

శంకరపట్నం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం అర్కండ్ల గ్రామ వాగులో మత్స్యకారులు గురువారం చేపల కోసం వేసిన వలలో కొండచిలువ చిక్కింది. ఈ సందర్భంగా చేపల కోసం మత్స్యకారులు వలలు వేసి బయటకు తీయగా అందులో కొండ చిలువ చిక్కుకొని ఉంది. దాంతో కొండచిలువను బయటకు తీసి తాడుతో లాగి సమీపంలో ఉన్న చెట్ల పొదల్లో వదిలేశారు.

వ్యాన్ ఢీకొని విద్యార్థిని మృతి



బొల్లి మహి(ఫైల్)


చిగురుమామిడి, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): స్కూలు నుంచి తన అక్కతో కలసి ఇంటి వస్తున్న చెల్లెలు ఇంటి సమీపంలో పాల వ్యాను ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందినది. చిగురుమామిడి ఎస్ఐ రాజేశ్ తెలిపిన కథనం ప్రకారం మండలంలోని బొమ్మనపల్లి గ్రామానికి చెందిన బొల్ల మహి(7) గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో 2వ తరగతి చదువుతుంది. సాయంత్రం తన అక్క అమూల్యతో కలిసి స్కూలు నుంచి ఇంటికి వస్తుండా పాల వ్యాన్ వెనకనుంచి వచ్చి ఢీకొనడంతో మహి అక్కడికక్కడే మృతి చెందింది. తండ్రి కూతురుని పట్టుకొని విలపిస్తున్న తీరు కంటతడి పెట్టించింది. మహి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాజేశ్ తెలిపారు.

గోదావరిఖనిలో వైద్యుడి ఐపీ పిటిషన్

- ఇద్దరు వైద్యులతో పాటు 15మందికి నోటీసులు - అదే బాటలో నలుగురు వ్యాపారులు

కోల్‌సిటీ, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): గోదావరిఖనికి చెందిన ప్రముఖ వైద్యుడు ఐపీ పిటీషన్ దాఖలు చేసినట్టు సమాచారం. ఇద్దరు వైద్యులతో పాటు మొత్తం 15మందికి నోటీసులు పంపారు. గోదావరిఖనికి చెందిన ఒక కాంట్రాక్టర్, పలువురు వ్యాపారులు సదరు వైద్యుడితో ఆర్థిక లావాదేవీలు ఉన్నట్టు తెలుస్తోంది. ఈ ఐపీ నోటీసులు కలకలం సృష్టిస్తున్నాయి. ముఖ్యంగా వైద్యవర్గాల్లో చర్చ జరుగుతోంది. కాగా గోదావరిఖనికి చెందిన పలువురు వ్యాపారులు కూడా ఇదే బాటలో ఉన్నట్టు తెలుస్తున్నది. కొందరు పిటిషన్లు దాఖలు చేయగా మరో నలుగురు పిటిషన్లు వేసేందుకు సిద్ధమైనట్టు సమాచారం.

యువకుడి ఆత్మహత్య



ప్రశాంత్ (ఫైల్)

ఇల్లంతకుంట, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం రహీంఖాన్‌పేట గ్రామపంచాయితీ పరిధిలోని ఎర్రనర్సుపల్లె గ్రామానికి చెందిన రెడ్డవేని ప్రశాంత్ (25) అనే యువకుడు ఆన్‌లైన్‌లో క్రిమిసంహారక మందును తెప్పించుకొని తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎర్రనర్సుపల్లె గ్రామానికి చెందిన రెడ్డవేని ప్రశాంత్ అనే యువకుడు కొద్ది సంవత్సరాలుగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. ఆసుపత్రికి వెళ్లగా ఆపరేషన్ చేసినా తరుచూ కడుపునొప్పి వస్తుండేది. ప్రశాంత్ ఇటీవల దేశంలోని పలు జ్యోతిర్లింగాలను దర్శించుకొని ఇంటికి వచ్చాడు. గ్రామంలోని వారందిరికీ ఏ వస్తువులు కావాలన్నా ఆన్‌లైన్‌లో బుక్‌చేసే ప్రశాంత్ క్రిమిసంహారక మందును కూడా బుక్ చేశాడు. ఈ నెల 13న అర్ధరాత్రి వ్యవసాయ పొలం వద్ద క్రిమిసంహారక మందుతాగి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. కుటుంబ సభ్యులు ఎల్లారెడ్డిపేటలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా చికిత్సపొందుతూ బుధవారం రాత్రి మృతిచెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు.

ఉరివేసుకుని వృద్ధుడి ఆత్మహత్య

యైటింక్లయిన్‌కాలనీ, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): రామగిరి మండలం సుందిల్ల గ్రామానికి చెందిన అనవేన కృష్ణమూర్తి(65) గురువారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన కథనం ప్రకారం కృష్ణమూర్తి భార్య క్యాన్సర్‌తో 13 ఏళ్ల క్రితం మృతి చెందింది. అప్పటి నుంచి ఒంటరిగా ఉంటున్నాడు. పెయింటింగ్ వర్క్ చేసే కృష్ణమూర్తి మద్యానికి బానిస కావడంతో కుటుంబ సభ్యులు పలుమార్లు మద్యం మానివేయాలని మందలించారు. ఒంటరిగా ఉంటున్న కృష్ణమూర్తి మానసికంగా కుంగిపోయాడు. ఈక్రమంలో గురువారం సాయంత్రం ఇంటి పైకప్పు రాడ్‌కు తాడుతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి కుమారుడు సంపత్‌కుమార్ తండ్రి కోసం ఇంటికి వచ్చి చూడగా ఆత్మహత్య చేసుకుని కనిపించాడు. సంపత్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు గోదావరిఖని టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

భార్య మందలించిందని ఆత్మహత్యాయత్నం

చికిత్స పొందుతూ మృతి



నర్సయ్య (ఫైల్)

ఎల్లారెడ్డిపేట డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగవద్దని భార్య మందలించడంతో మనస్తాపం చెందిన భర్త దొమ్మాటి నర్సయ్య(45) ఈ నెల 10న ఉరి వేసుకుని ఆత్మహత్యాయత్నం చేశాడు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. ఈ సంఘటన ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్ గ్రామంలో జరిగింది. నర్సయ్య మద్యానికి బానిసయ్యాడు. ఈనెల 10న మద్యం మత్తులో ఇంటికి చేరుకున్న నర్సయ్యను భార్య పద్మ మందలించింది. మనస్తాపం చెందిన నర్సయ్య గదిలోకి వెళ్లి దూలానికి ఉరి వేసుకున్నాడు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

కరీంనగర్ క్రైం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రూరల్ మండలం బొమ్మకల్ గ్రామంలోని సాయినగర్‌లో బుధవారం రాత్రి తాళం వేసి ఉన్న ఇంటిలో దుండగులు చొరబడి వెండి ఆభరణాలతో పాటు నగదు ఎత్తుకుపోయారని బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు. బొమ్మకల్‌కు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు బంగారి సదానందం బుధవారం ఇంటికి తాళం వేసి ఊరికి వెళ్లాడు. గురువారం సాయంత్రం ఇంటికి వచ్చి చూసేసరికి తాళం పగలగొట్టి ఉంది. లోపలికి వెళ్లి చూడగా బీరువాలో భద్రపరిచిన 20 వేల నగదుతో పాటు 40 తులాల వెండి చోరీకి గురైనట్లు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

అసెంబ్లీలో మన నేతలు

ప్రాజెక్టుల్లో నీటిని నింపండి

- వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



వేములవాడ, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): వేములవాడ నియోజకవర్గ పరిధిలోని వివిధ ప్రాజెక్టుల్లో ముందస్తుగా నీటిని నింపేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని వేములవాడ శాసనసభ్యుడు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సాగునీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కోరారు. గురువారం ఆయన అసెంబ్లీలో మాట్లాడుతూ శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు ద్వారా వేములవాడ నియోజకవర్గ పరిధిలోని ప్రాజెక్టులకు ఈనెల ఆఖరు వరకు సాగునీరు అందించాలన్నారు. తద్వారా నియోజకవర్గంలోని మల్కాపేట, ఫాజుల్‌నగర్, చందుర్తి, జోగాపూర్ చెరువులను నీటితో నింపాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. ప్యాకేజ్-9లోని మల్కాపేట రిజర్వాయర్‌లో ఇదివరకే ఒక్క టీఎంసీ నీరు ఉందని, మరో టీఎంసీ నీటిని నింపే ప్రక్రియ చేపట్టాలన్నారు. తద్వారా వేములవాడ నియోజకవర్గంలోని రైతాంగానికి లబ్ధి చేకూర్చాలని కోరారు. కలికోట సూరమ్మ రిజర్వాయర్ పనులు ఇప్పటికే ముమ్మరంగా కొనసాగుతున్నాయని, కుడి, ఎడమ కాలువల పనులు ప్రారంభం కావాల్సి ఉందని, ఇందుకోసం ఇటీవల జిల్లా కలెక్టర్ భూ సేకరణకు పబ్లిక్ నోటిఫికేషన్ ఇచ్చారని తెలిపారు. కుడి, ఎడమ కాలువల నష్టపరిహారం చెల్లించి, బొమ్మెన ప్రాజెక్టుకు నిధులను విడుదల చేయాల్సిందిగా మంత్రిని కోరారు. దీనికి మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి సానుకూలంగా స్పందించి త్వరలోనే మల్కాపేట రిజర్వాయర్ నీటితో నింపి, నష్టపరిహారం కోసం నిధులు విడుదల చేస్తామని హామీ ఇచ్చారు.

దళితుల అసైన్డ్ భూములను అప్పగించాలి

- ధరణి సమస్యలు ప్రస్తావించిన ఎమ్మెల్యే కవ్వంపల్లి



కరీంనగర్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): బీఆర్ఎస్ ప్రభుత్వం గతంలో హరితహారం, క్రీడా ప్రాంగణాలు, శ్మశాన వాటికల కోసం దళితులకు కేటాయించిన అసైన్డ్ భూములను తీసుకుందని, తిరిగి ఆ భూములను వారికి పంపిణీ చేయాలని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ప్రభుత్వాన్ని కోరారు. గురువారం రాష్ట్ర అసెంబ్లీ సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ పేద దళితులకు కేటాయించిన భూములను ప్రజా అవసరాల పేరుతో ప్రభుత్వం తీసుకోవడంతో దళితులకు అన్యాయం జరిగిందన్నారు. దళితులకు న్యాయం చేసే విధంగా ప్రభుత్వం స్పందించాలని కోరారు. మానకొండూర్ నియోజకవర్గంలోని గన్నేరువరం మండలం చొక్కారావుపల్లి రైతులకు ధరణిలో జరిగిన అన్యాయాన్ని సవరించాలన్నారు. చొక్కారావుపల్లిలో రైతులు 1958 నుంచి పట్టాలు కలిగి ఉన్నారన్నారు. రైతులకు సంబంధించి 163 ఎకరాల పట్టా భూములు కాగా, ధరణిలో 153 ఎకరాలను మాత్రమే చూపించారన్నారు. ధరణిలో జరిగిన తప్పులతో రైతులు ఆందోళన చెందుతున్నారన్నారని అసెంబ్లీలో వివరించారు. ప్రభుత్వం ధరణిలో జరిగిన తప్పులను వెంటనే సవరించి చొక్కారావుపల్లె రైతులకు న్యాయం చేయాలని రెవెన్యూ శాఖ మంత్రిని కవ్వంపల్లి కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకు వస్తున్న భూమాతను ధరణిలా తప్పులతో కాకుండా చూడాలని కవ్వంపల్లి విన్నవించారు.

పీఆర్టీయూతోనే సమస్యల పరిష్కారం

● రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దామోదర్‌రెడ్డి



మాట్లాడుతున్న పీఆర్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దామోదర్‌రెడ్డి

కరీంనగర్ టౌన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం పీఆర్టీయూతోనే సాధ్యమని ఆ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుల్గం దామోదర్‌రెడ్డి అన్నారు. గురువారం నగరంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో జిల్లా అధ్యక్షుడు ఐలేని కరుణాకర్‌రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన జిల్లా కార్యనిర్వాహక సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడమే ధ్యేయంగా పీఆర్టీయూ ఆవిర్భవించిందన్నారు. ఈనెల 31లోపు 317 జీవోకు సంబంధించిన స్పౌజ్, మెడికల్, పరస్పర బదిలీల ప్రక్రియ పూర్తవుతుందని చెప్పారు. ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులను వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. మాజీ ఎమ్మెల్సీ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ దేశంలోనే అత్యధిక సభ్యత్వం కలిగిన సంఘం పీఆర్టీయూ అని అన్నారు. ఈ సమావేశంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పీఆర్టీయూ అభ్యర్థి వంగ మహేందర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి మర్రి జైపాల్‌రెడ్డి, ముస్కు తిరుపతిరెడ్డి, జాలి రాఘవరెడ్డి, జాలి మహేందర్‌రెడ్డి, పాకాల ప్రభాకర్‌రెడ్డి, వివిధ మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యల పరిష్కారంలో విఫలం



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రజనీకాంత్

సిరిసిల్ల రూరల్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్రప్రభుత్వం విఫలమైందని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు శనిగరపు రజనీకాంత్ అన్నారు. సిరిసిల్ల పట్టణంలోని ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో గురువారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యారంగ సమస్యలు పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తి చేసుకున్న కూడా ఇప్పటి వరకు విద్యాశాఖ మంత్రిని సీఎం రేవంత్‌రెడ్డి నియమించకపోవడంతో విద్యారంగ సమస్యలను పట్టించుకునే వారే లేకుండా పోయారని వెంటనే విద్యాశాఖ మంత్రిని నియమించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తి చేసుకుందని ప్రజా విజయోత్సవాలను జరుపుకోవడం కాదని, విద్యాశాఖ మంత్రిని నియమించి రాష్ట్రంలో నెలకొన్న విద్యారంగ సమస్యలను పరిష్కారించాలని కోరారు. ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలన్నారు. గురుకులాల్లో విద్యార్థులు సమస్యలతో సతమతమవుతున్నారని పెంచిన మెస్ చార్జీలు, కాస్మోటిక్ చార్జీలను వెంటనే అమలు చేయాలన్నారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు మంద అనిల్‌కుమార్, జిల్లా కార్యదర్శి మాల్లారపు ప్రశాంత్, ఉపాధ్యక్షుడు జూలపల్లి మనోజ్, కుర్ర రాకేష్ పాల్గొన్నారు.

రైస్ మిల్లుపై కేసు నమోదు

ఓదెల, డిసెంబర్ 19 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్ర శివారులోని మల్లికార్జున రైస్ మిల్లుపై గురువారం కేసు నమోదు చేసినట్లు పెద్దపల్లి, సుల్తానాబాద్, మంథని డీటిసిఎస్, సిఎస్ఐ అధికారులు తెలిపారు. రైస్ మిల్లులో డీటీసీఎస్ సీఎస్ఐ అధికారులు తనిఖీలు నిర్వహించగా, ప్రభుత్వం ఇచ్చిన వరి ధాన్యం 33,063.81 బదులుగా మిల్లు యజమాన్యం ఇవ్వవలసిన సీఎంఆర్ ధాన్యం 22,152.81 క్వింటాళ్లు కాగా, ఇందులో 32,636.31 క్వింటాళ్ల ధాన్యం తేడా వచ్చిందని తెలిపారు. ఈ మేరకు తెలంగాణ కస్టమ్స్ బిల్లింగ్ ఆర్డర్ 2015 ప్రకారంగా ఓదెల మల్లికార్జున రా రైస్ మిల్ పై కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు.

గృహ నిర్మాణదారులకు ఊరట..!

● తగ్గిన సిమెంట్, ఐరన్ ధరలు



సిమెంట్ బస్తాలు | ఐరన్ | హుజూరాబాద్‌లో నిర్మాణంలో ఉన్న ఇల్లు

హుజూరాబాద్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఇళ్లు కట్టుకోవాలంటే సామాన్య, మధ్య తరగతి కుటుంబాలకు ఎంతో భారం. ఇంటి నిర్మాణ సామాగ్రి ధరలు ఎక్కువగా ఉండటంతో చాలా మంది గృహ నిర్మాణాలను వాయిదా వేస్తూ వస్తున్నారు. ప్లాట్లు కొనుగోలు చేసి నిర్మాణాలు మొదలు పెట్టాలంటే భయపడుతున్నారు. కూలీ రేట్లు, నిర్మాణ వస్తువుల ధరలు విపరీతంగా పెరిగాయి. ప్రసత్తు గృహనిర్మాణం చేసుకునేవారికి అనుకూలమైన సమయంగా చెపుతున్నారు. ఎందుకంటే సిమెంట్, ఐరన్ ధరలు భారీగా తగ్గాయి. ఇటీవల కాలంలో మున్సిపాలిటీలలో గృహ నిర్మాణాల కోసం ప్లాట్లు కొనుగోలు చేసిన చాలా మంది నిర్మాణంపై వేచి చూస్తున్నారు. ఇల్లు నిర్మాణం చేయాలంటే సిమెంట్, ఐరన్ ధరలు అందుబాటులో లేకుండా పోయాయి. మూడు నెలల క్రితం సిమెంట్ బస్తాకు రూ. 360-370 వరకు ధర ఉండగా, ఐరన్ క్వింటాల్‌కు రూ. 7,500 ధర ఉండేది. ఈ ధరలను చూసి చాలా మంది నిర్మాణాలు చేపట్టాలంటే జంకేవారు. ప్రస్తుతం సిమెంట్ బస్తాకు 50రూపాయలు, ఐరన్ క్వింటాల్‌కు 600ల నుంచి 700 రూపాయల వరకు దిగింది. దీంతో గృహ నిర్మాణాలు పెరిగే అవకాశం ఉంది. ఈ ధరలు మరో నెల రోజుల్లో పెరుగుతాయని వ్యాపారస్తులు చెబుతున్నారు. ఇదిలా ఉండగా ఇంటికి వేసుకునే రంగుల ధరలు కూడా తగ్గినట్లు వ్యాపారులు పేర్కొంటున్నారు. డిసెంబరు నుంచి జూన్ వరకు నిర్మాణాలకు అనుకూలంగా ఉండటంతో పాటు నిర్మాణ సామగ్రి ధరలు తగ్గడంతో ఇళ్లు కట్టుకోవడానికి ఎక్కువ మంది ఆసక్తి చూపే అవకాశం ఉంది.

● సిమెంట్, ఐరన్ ధరలు తగ్గాయి.



సిమెంట్, ఐరన్ ధరలు తగ్గడంతో ఇల్లు నిర్మాణం చేపడుతున్నాను. గతంలో ఎక్కువ ధరలు ఉండ డంతో నిర్మాణం చేపట్టలేదు. సిమెంట్ బస్తాకు రూ. 50, క్వింటాల్ ఐరన్‌కు రూ. 700 ధరలు తగ్గాయి. మళ్లీ ధరలు పెరుగుతాయనే ఉద్దేశ్యంతో ఇల్లు నిర్మాణం చేపడుతున్నాను.

- పోగు శ్రీనివాస్, గృహ నిర్మాణదారుడు, హుజూరాబాద్

● ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్నాయి



సిమెంట్, ఐరన్ ధరలు తగ్గాయి. మూడు నెలల క్రితం సిమెంట్, ఐరన్ ధరలు ఎక్కువగా ఉండేది. అధిక ధరలు ఉండడంతో ఇళ్ల నిర్మాణాలు జరగలేదు. ఇప్పుడిప్పుడే సిమెంట్, ఐరన్ ధరలు తగ్గడంతో ఇళ్ల నిర్మాణం చేపడుతున్నారు.

- దండ శ్రీనివాస్, సిమెంట్ వ్యాపారి, హుజూరాబాద్

రేపు ఉమ్మడి జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు

సిరిసిల్ల టౌన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర క్రీడా ప్రాధి కార సంస్థ ఆదేశాల మేరకు సీఎం కప్-2024 వాలీబాల్ ఉమ్మడి జిల్లా స్థాయి పోటీలను సిరిసిల్ల పట్టణం మినీ స్టేడియంలో శనివారం నిర్వహిస్తున్నామని జిల్లా యువజన క్రీడాశాఖ అధికారి అజ్మీరా రాందాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లా స్థాయి పోటీలలో కరీంనగర్, సిరిసిల్ల, జగిత్యాల, పెద్దపల్లి మహిళ, పురుషుల జట్లు పాల్గొంటాయని పేర్కొన్నారు. నాలుగు జిల్లాల జట్లలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారుల ఎంపిక చేసి ఉమ్మడి కరీంనగర్ జట్టు నుంచి రాష్ట్రస్థాయి సీఎం కప్ పోటీలకు ఎంపిక చేస్తామని తెలిపారు.

డిగ్రీ పరీక్షల్లో ఇద్దరి డీబార్

గణేశ్‌నగర్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాల యం పరిధిలో నిర్వహిస్తున్న డిగ్రీ మూడో, ఐదో సెమిస్టర్ పరీక్షల్లో ఇద్దరు విద్యార్థులు డీబార్ అయినట్లు పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ఎస్వీ శ్రీరంగప్రసాద్ తెలిపారు. ధర్మపురిలోని ఎస్ఎల్ఎన్ఎస్ఎ కళాశాలలో ఒకరు, జగిత్యాల నలంద డిగ్రీ కళాశాల జగిత్యాలలో మరొకరు డీబార్ అయ్యారన్నారు.

పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసిన వీసీ

గణేశ్‌నగర్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): నగరంలోని శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో జరుగుతున్న డిగ్రీ సెమిస్టర్ పరీక్షల సెంటర్లను గురువారం వీసీ ఉమేష్ కుమార్ సందర్శించారు. పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగ కుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు.

ఎమ్మెల్సీ ఓటరు జాబితాలో ఒక్కరికే ఎనిమిది ఓట్లు

● వందల సంఖ్యలో డబుల్, ఆపై ఎంట్రీలు ● పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సర్దార్ రవీందర్‌సింగ్

కరీంనగర్ టౌన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు జాబితాలో ఒక్కరికే ఎనిమిది చోట్ల ఓటు హక్కు కల్పించారని కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ సర్దార్ రవీందర్‌సింగ్ ఆరోపించారు. గురువారం కరీంనగర్‌లో ఆయన విలేకరుల మాట్లాడుతూ ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ జిల్లాల్లో వందల సంఖ్యలో ఒక్కో వ్యక్తికి వేర్వేరు చోట్ల ఓటు హక్కు కల్పిస్తూ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు జాబితాను రూపొందించారన్నారు. ఓటరు జాబితాను ఆధార్‌కార్డుతో లింక్ చేస్తే పారదర్శకంగా ఉండేదని అన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి పోటీచేస్తున్న కొందరు అభ్యర్థులు వేలల్లో ఓటరు నమోదు చేయించామని చెప్పడంతో తాను ఓటరు జాబితాను నిశితంగా పరిశీలించగా 24 గంటల్లో 200కు పైగా డబుల్, ట్రిపుల్ నుంచి ఎనిమిది చోట్ల ఒకే అభ్యర్థి పేరు ఉన్నట్లు గుర్తించానని చెప్పారు. జాబితాలో శ్రీనివాస్, సంపత్ లాంటి పేర్లు ఎక్కువగా ఉండగా, వారి తండ్రిపేరు, వయసు, చిరునామా, ఆధార్ నంబర్ ఒకటే ఉందన్నారు. ఒకే వ్యక్తికి ఇన్ని చోట్ల ఎలా ఓటు వచ్చిందని ఆశ్చర్యం వేసి కలెక్టర్ దృష్టికి, ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకెళ్లాలని నిర్ణయించుకొని ఆధారాలను జత చేసి ఫిర్యాదు కూడా చేస్తున్నానని రవీందర్‌సింగ్ తెలిపారు. దీనిపై ఎన్నికల కమిషన్ వివరణ ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. అంతేకాకుండా జనవరి 1న ఎమ్మెల్సీ ఓటరు తుది జాబితా వెల్లడించనున్నందున ఇప్పటి వరకు రూపొందించిన జాబితాను పునః పరిశీలన చేసి ఒకరికి ఒకే ఓటు ఉండేలా చూడాలని రవీందర్‌సింగ్ కోరారు. ఈసమావేశంలో నాయకులు గుంజపడుగు హరిప్రసాద్, పెండ్యాల మహేశ్, కెమసారపు తిరుపతి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సర్దార్ రవీందర్‌సింగ్

సౌత్‌జోన్ వాలీబాల్ పోటీలకు ఎంపిక



వాలీబాల్ పోటీలకు ఎంపికైన అఖిల్, మధుసూదన్

వేములవాడ టౌన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): వేములవాడ మండలం అగ్రహారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తృతీయ సంవత్సరం చదువుతున్న ఇద్దరు విద్యార్థులు సౌత్ జోన్ వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యారని ఫిజికల్ డైరెక్టర్ శ్రీధర్ రావు ఒక ప్రకటనలో తెలిపారు. అగ్రహారం డిగ్రీ కళాశాలలో బీఏ తృతీయ సంవత్సరం చదువుతున్న అఖిల్, మధుసూదన్ అనే ఇద్దరు విద్యార్థులు శాతవాహన విశ్వవిద్యాలయం వాలీబాల్ జట్టుకు ఎంపికయ్యారు. ఈనెల 18వ తేదీ నుంచి 22వ తేదీ వరకు కేరళలో నిర్వహించే సౌత్ జోన్ పోటీల్లో పాల్గొననున్నట్లు ఫిజికల్ డైరెక్టర్ శ్రీధర్‌రావు తెలిపారు.

రామగుండంలో ఎన్‌డీఆర్ఎఫ్ బృందం పర్యటన

కోల్‌సిటీ, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం(ఎన్‌డీఆర్ఎఫ్) బృందం గురువారం రామగుండం ప్రాంతంలో పర్యటించింది. గత రెండేళ్లుగా గోదావరి వరద ముంపునకు గురైన మల్కాపూర్, సప్తగిరికాలనీ, హెడ్‌వర్క్స్ ఏరియా, పుష్కరఘాట్లు తదితర ప్రాంతాలను పర్యటించింది. రామగుండం రెవెన్యూ అధికారులు వరద ముంపు ప్రాంతాలు, లోతట్టు ప్రాంతాలను ఎన్‌డీఆర్ఎఫ్ బృందానికి చూపారు. గోదావరినదికి రెండేళ్ల క్రితం భారీ వరదలు వచ్చి సింగరేణి హెడ్‌వర్క్స్ వద్ద ఉద్యోగులు చిక్కుకున్న సమయంలో ప్రమాదకరమైన వరద సమయంలో ఎన్‌డీఆర్ఎఫ్ బృందం వారిని రక్షించింది. దీంతో వరద ముంపు ఏ విధంగా గురవుతుందని, గోదావరి వరద నీరు ఎలా చొచ్చుకు వస్తుందనే విషయాలపై ఆరా తీశారు. అనంతరం సప్తగిరికాలనీలో వరదలు, ఇతర విపత్తులు ఎదురైనప్పుడు తీసుకోవాల్సిన సహాయ చర్యలపై నగరపాలక సంస్థ పారిశుధ్య, తాగునీటి సరఫరా తదితర విభాగాల సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎన్‌డీఆర్ఎఫ్ 10వ బెటాలియన్ విజయవాడ కమాండెంట్ ఐఎన్ఎస్ఎఫ్ బబ్లు బిశ్వాస్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో తహసీల్దార్ కుమారస్వామి, కార్పొరేషన్ ఏసీపీ శ్రీధర్ ప్రసాద్, ఈఈ రామన్, ఫైర్ ఆఫీసర్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.



గోదావరి తీరంలో పరిశీలన జరుపుతున్న ఎన్‌డీఆర్ఎఫ్ బృందం



డీటీసీని కలిసిన ఏఎంవీలు

డీటీసీని కలిసిన నూతన ఏఎంవీఐలు

తిమ్మాపూర్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) ద్వారా ఎంపికై రాష్ట్ర రవాణా శాఖలో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో నూతనంగా విధులు చేపట్టిన ఆరుగురు అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు గురువారం మండలంలోని జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో డీటీసీ పురుషోత్తంను మర్యాద పూర్వకంగా కలిశారు. కరీంనగర్ జిల్లాకు హరిత యాదవ్, పెద్దపల్లి జిల్లాకు వంశీకృష్ణ, నిఖిల్ కుమార్, రామగుండం ప్రదీప్ సాగర్, రాజన్న సిరిసిల్లకు పృథ్విరాజ్ వర్మ, జగిత్యాల జిల్లాకు షేక్ రియాజ్‌లను నియమిస్తూ రాష్ట్ర ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ కే.సురేంద్ర మోహన్ ఉత్తర్వులు జారీచేయగా వారు ఈ నెల 16న ఉద్యోగాల్లో చేరారు. ఈ సందర్భంగా గురువారం డీటీసీ పురుషోత్తంను మర్యాద పూర్వకంగా కలిశారు.

పేరిణి, కూచిపూడిలో ఖని కళాకారుడి ప్రతిభ

● జాతీయస్థాయిలో ప్రదర్శనలు ● పలు అవార్డులు సొంతం



సిలికానాంధ్ర కూచిపూడి నృత్య బృందంలో నాగరాజు



అవార్డు అందుకుంటున్న నాగరాజు

కోల్‌సిటీటౌన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఒగ్గు కథ కళాకారుడైన తండ్రి స్ఫూర్తితో తాను కూడా కళాకారుడిని కావాలనుకున్నాడు.. తల్లిదండ్రులు, గురువు ప్రోత్సాహంతో పేరిణి, కూచిపూడి నృత్య కళాకారుడిగా రాణిస్తూ జాతీయ స్థాయిలో ప్రదర్శనలు ఇచ్చాడు.. పెద్దపల్లి జిల్లా గోదావరిఖని సప్తగిరికాలనీకి చెందిన కొట్టె నాగరాజు పేరిణి, కూచిపూడి నృత్య కళల్లో తన అద్భుత ప్రదర్శనతో ప్రసంశలందుకుంటున్నాడు. నాగరాజు తల్లి లక్ష్మి, తండ్రి రాములు. ఒగ్గుకథ కళాకారుడిగా రాములు సుపరిచితుడు. తండ్రి ఒగ్గుకథ కళాకారుడు కావడంతో నాగరాజుకు కళలపై ఆసక్తి పెరిగింది. దీంతో తల్లిదండ్రులు నాట్యగురువు జక్కు కృష్ణ వద్ద శిక్షణ ఇప్పించారు. అనంతరం నాగరాజు హైదరాబాద్‌లోని తెలుగు విశ్వవిద్యాలయంలో పేరిణి, కూచిపూడి నృత్యంలో డిప్లొమా పూర్తిచేశారు. నాగరాజు రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రదర్శనలు ఇచ్చి పలు అవార్డులు అందుకున్నారు. 2012 సంవత్సరంలో సిలికాన్ ఆంధ్ర నిర్వహించిన కూచిపూడి బృంద నృత్యంలో పాల్గొని గిన్నిస్‌వరల్డ్ రికార్డు అందుకున్నారు. నాగరాజు ఇప్పటి వరకు 200పైగా ప్రదర్శనలు ఇచ్చారు. నాట్య ప్రవీణ, నాట్యరత్న, నాట్య కళాబ్రహ్మ అవార్డులు అందుకున్నారు. తాను నేర్చుకున్న విద్యను పదిమందికి శిక్షణ ఇవ్వాలన్న సంకల్పంతో స్నేహ ఆర్ట్స్ అకాడమీ, రుద్ర డ్యాన్స్ అకాడమీని ఏర్పాటు చేసి పలువురికి కూచిపూడి నృత్యంలో శిక్షణ ఇస్తున్నారు.

● పేరిణి నాట్యాన్ని అంతర్జాతీయస్థాయిలో ప్రదర్శించాలి : కొట్టె నాగరాజు



తెలంగాణ రాష్ట్ర కళానృత్యం పేరిణి నాట్యాన్ని అందరికి తెలియజేసి చిన్నారులను కళాకారులుగా తీర్చిదిద్దాలని అకాడమీ ఏర్పాటు చేశా. పేరిణి శివతాండవాన్ని, కూచిపూడి నృత్యం అంతర్జాతీయ స్థాయిలో ప్రదర్శించాలని కోరిక.

కొత్తగట్టు శ్రీమత్స్యగిరీంద్రస్వామి ఆలయ హుండీ లెక్కింపు

శంకరపట్నం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం కొత్తగట్టు శ్రీమత్స్యగిరీంద్రస్వామి దేవాలయ హుండీ లెక్కింపు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాదాయ శాఖ పరిశీలకులు సత్యనారాయణ సమక్షంలో 8నెలల హుండీ లెక్కించగా, రూ. 1,44,144 ఆదాయం సమకూరినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ఉప్పుగల మల్లారెడ్డి, ఆలయ ఈవో సుధాకర్, ధర్మకర్తలు పాల్గొన్నారు.

రిపబ్లిక్ డే పరేడ్‌కు ఎన్ఎస్ఎస్ వలంటీర్ ఎంపిక



రాహుల్

కోల్‌సిటీటౌన్, డిసెంబర్ 19(ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో జరుగనున్న రిపబ్లిక్ డే పరేడ్‌కు గోదావరిఖని ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ వలంటీర్ మామిడి రాహుల్ ఎంపికయ్యాడు. జనవరి 26న జరిగే రిపబ్లిక్ డే పరేడ్‌తో పాటు మరుసటి రోజు భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధికారిక నివాసంలో నిర్వహించే ఎట్‌హోం కార్యక్ర మంలో రాహుల్ పాల్గొననున్నాడు. గురు వారం కళాశాల ఆవరణలో జరిగిన కార్య క్రమంలో రాహుల్‌ను ప్రిన్సిపాల్ జైశంకర్ ఓజా, ఎన్ఎస్ఎస్ పీవో సాంబశివరావు, డాక్టర్ ఎం.నరేష్, డాక్టర్ కిరణ్మయిఅభినందించారు.

న్యూస్ బాక్స్

రేపు ఉచిత వైద్య శిబిరం

కమాన్‌పూర్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని అంగడిబజారులో ఈనెల 21న ఫార్చ్యూన్ మెడికేర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం జరగనున్నట్లు బీజేపీ సీనియర్ నాయకుడు మచ్చగిరి రాము తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని ప్రెస్ క్లబ్‌లో ఉచిత వైద్య శిబిరానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. బీజేపీ మండలాధ్యక్షుడు జంగపెల్లి శ్రీనివాస్, నా యకులు మల్యాల అరుణ్‌కుమార్, కొయ్యడ సతీష్‌లు ఉన్నారు.

యేసుక్రీస్తు ప్రేమను చాటిచెప్పాలి

ముత్తారం, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): యేసుక్రీస్తు మానవులపైన చూపించిన ప్రేమను చాటి చెప్పాలని ఇంటర్నేషనల్ మిషన్స్ ఇండియా ప్రధాన కార్యదర్శి అంకరి కుమార్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని సీయోను ప్రార్థన మందిరం ఆధ్వర్యంలో చౌరస్తాలో క్రిస్మస్ కేక్ కట్ చేసి క్యారల్స్ నిర్వహించారు. సీయోను ప్రార్థన మందిరం స్థానిక పాస్టర్ కలువల శామ్యూల్, పాస్టర్లు దూడ మహేష్, మంథని మార్క్, అజ్మీరా దయరాజు, గద్దల రాజేష్, సంఘ పెద్దలు ఎం కే జోసెఫ్, మంథని ప్రసాద్, ఈర్ల సదానందం, గుమ్మడి పెద్దయ్య (తిమోతి) తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ఒలింపిక్ సంఘం సభ్యుడికి సన్మానం

సుల్తానాబాద్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఒలింపిక్ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యునిగా ఎన్నికైన సిలివేరు మహేందర్‌ను గురువారం జిల్లా అదనపు కలెక్టర్ వేణు, మున్సిపల్ చైర్‌పర్సన్ గాజుల లక్ష్మీ రాజమల్లు తదితరులు సన్మానించారు.

మాల మహానాడు నాయకుల ముందస్తు అరెస్ట్

ఓదెల, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మాల మహానాడు నాయకులను గురువారం ఎస్‌ఐ అశోక్‌రెడ్డి ఆధ్వర్యంలో అరెస్టు చేశారు. చలో అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి తరలివెళుతున్నారనే అనుమానంతో జిల్లా అధ్యక్షుడు మద్యాల నరసయ్య, డివిజన్ అధ్యక్షుడు మద్దెల శ్రీనివాస్, మండల అధ్యక్షుడు గొర్రె కరుణాకర్, మాజీ ఉపసర్పంచ్ రాజుల కిషన్ తదితరులను ముందస్తుగా అరెస్టు చేసి సొంత పూచీకత్తుపై విడుదల చేసినట్లు ఎస్సై తెలిపారు.

● జూలపల్లి (ఆంధ్రజ్యోతి) : అసెంబ్లీ ముట్టడికి వెళ్తారనే ముందస్తు సమాచారంతో గురువారం మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన మాలకుల సంఘం నాయకులను జూలపల్లి పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. మాజీ సర్పంచ్ గొడిసెల రవి, కంకనాల జ్యోతిబసు, సొల్లు స్వాం, పాటకుల మహేష్ పలువురు ఉన్నారు.

ఆర్థిక సహాయం

కాల్వశ్రీరాంపూర్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో రేణికుంట సమ్మయ్య ఇటీవల మృతిచెందగా బాధిత కుటుంబాన్ని యూత్ కాంగ్రెస్ మండల శాఖ అధ్యక్షుడు సొన్నాయిటెంకం శివరామకృష్ణ గురువారం పరామర్శించారు. మృతుని కుటుంబానికి 50కిలోల బియ్యం అందజేశారు. రానవేనా క్రాంతి, దర్శుల రాములు, కొంతం మధూకర్, తాండ్ర సురేష్, బందెల శ్రీనివాస్, మద్దుల నరేష్ పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

పెద్దపల్లి రూరల్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాఘవపూర్‌లో ఇటీవల మృతిచెందిన పారుపల్లి అమృతమ్మ, మంథని నర్సయ్య, బంతుల మహేష్‌ల కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి పరామర్శించారు. వెంట కొమురయ్య, శంకర్, సదయ్య, రమేష్ ఉన్నారు.

పదో రోజుకు ఉద్యోగుల దీక్ష

పెద్దపల్లి రూరల్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : సమగ్ర శిక్ష అబియాన్ ఉద్యోగుల నిరవధిక సమ్మె పదోరోజుకు చేరింది. గురువారం రోడ్డుపై వంటావార్పు కార్యక్రమం నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు.

దాతల సహకారం.. స్వాములకు సౌకర్యం..

- అయ్యప్ప స్వాములకు నిత్యాన్నదానం.. - పదిహేనేళ్లుగా సేవలు.. - అరవై రోజుల పాటు భిక్ష


అయ్యప్ప స్వాములకు అన్నదానం చేస్తున్న దాతలు


వంట కోసం కూరగాయలు తరుగుతున్న స్వాములు

సుల్తానాబాద్ డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : సుల్తానాబాద్ పట్టణ శివారులోని శాస్త్రీనగర్ అభయాంజనేయ స్వామి ఆలయ ఆవరణలో అయ్యప్ప స్వాముల కోసం 15 ఏళ్లుగా అన్నదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. పూసాల మాజీ సర్పంచ్ సాయిరి పద్మ, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సాయిరి మహేందర్‌లు ఈ అన్నదాన శిబిరాన్ని ప్రారంభించారు. సుల్తానాబాద్‌కు చెందిన గురుస్వాములు మిట్టపల్లి మురళి, మేరుగు వేంకటేశ్, మాటేటి శ్రీనివాస్, తమ్మనవేని సతీశ్,గందె రాజు, వేగోళం శంకర్‌గౌడ్ తదితరుల సహకారంతో నాటి నుంచి నేటి వరకు అన్నదాన శిబిరం కొనసాగిసున్నారు. సుల్తానాబాద్‌తో పాటు పరిసర మండలాలకు చెందిన స్వాములకు మధ్యాహ్నం భోజనం పెడతారు. ప్రతి రోజు దాదాపు 100 నుంచి 200 మంది స్వాములు అన్నదాన శిబిరానికి వస్తున్నారు. మరోవైపు అయ్యప్ప పడి పూజలు కూడా పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నారు.

దాతల సహకారంతో నిర్వహిస్తున్నాం..

- సాయిరి మహేందర్, గురుస్వామి



సేవా భావం, భక్తి భావంతో అయ్యప్ప స్వాముల కోసం ఈ నిత్యాన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించాం. నేడు కూడా 18ఏళ్లుగా దీక్షలు తీసుకుంటున్నాను. స్వాములకు సకాలంలో భోజనం దొరకక ఇబ్బందులు పడేవారు. అందుకే వారి కోసం దాతల సహకారంతో శిబిరాన్ని నిర్విఘ్నంగా కొనసాగిస్తున్నాం. దాతలు లేనిరోజు నిర్వాహకులే భరిస్తారు .

స్వాములకు సౌకర్యంగా ఉంది..

- మిట్టపల్లి మురళి గురుస్వామి



శాస్త్రీనగర్‌లో కొనసాగుతున్న అయ్యప్ప స్వాముల నిత్యాన్నదానం వందలాది మంది స్వాములకు సౌకర్యంగా ఉంది. సుల్తానాబాద్‌తో పాటు పరిసర మండలాలకు చెందిన స్వాములు నిత్యం ఇక్కడే భిక్ష చేస్తారు. భోజన సమయానికి సుల్తానాబాద్, దాని సమీప గ్రామాల్లో ఎక్కడ ఉన్నా ఇక్కడకి చేరుకుంటారు. స్వాములకు ఈ శిబిరం అనుకూలంగా ఉంటుంది.

ఆధ్యాత్మిక, భక్తి కార్యక్రమాలకు ప్రోత్సాహం..

- పద్మ, మాజీ సర్పంచ్, పూసాల



సుల్తానాబాద్ ప్రాంతంలో ఆధ్యాత్మిక, భక్తి కార్యక్రమాలకు ప్రోత్సాహం, మావంతు సహాయసహకారాలు అందిస్తున్నాం. పేరుకు అయ్యప్ప స్వాముల కోసం అయినా ఇందులో హన్‌మాన్ దీక్షాపరులు, వెంకటేశ్వర శరణాగతి దీక్షలు తీసుకున్న స్వాములు కూడా వస్తారు. స్థానిక గురుస్వాముల, దాతల సహకారంతో నిర్విఘ్నంగా కొనసాగిస్తున్నాం.

బీమా పథకాలపై అవగాహన

కాల్వశ్రీరాంపూర్, డిసెంబర్ 19 (ఆంధ్రజ్యోతి) : జీవితబీమా చేసుకుంటే మీకుటుంబానికి రక్షణగా ఉంటుందని తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్ రత్నాకర్ అన్నారు. మండలంలోని వెన్నంపల్లిలో తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్ రత్నాకర్ గ్రామస్థులతో కలిసి జనసురక్ష కార్యక్రమం నిర్వహించారు. కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు, బీమాపథకాలపై రత్నాకర్ అవగాహన కల్పించారు.

స్వర్ణకార సంఘం అధ్యక్షుడిగా తిరుపతి

ధర్మారం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ధర్మారం పట్టణ స్వర్ణకార సంఘం అధ్యక్షులుగా మూటపెల్లి తిరుపతి, ప్రధానకార్యదర్శిగా పూసాల శ్రీధర్‌లు ఎన్నికయ్యారు. గురువారం సంఘ భవనంలో నిర్వహించిన ఎన్నికల నామినేషన్ ప్రక్రియలో అధ్యక్ష పదవికి ఒక నామినేషన్ ప్రధాన కార్యదర్శి పదవికి ఒక నామినేషన్ మాత్రమే వచ్చాయి. పోటీలో ఎవరు లేకపోవడంతో నామినేషన్ వేసిన వారినే ఎన్నికైనట్లు ఎన్నికల ప్రధాన అధికారి పెద్దపల్లి జిల్లా స్వర్ణకార సంఘం ప్రధాన కార్యదర్శి రామోజు రాజు ధ్రువీకరించారు.

రాష్ట్రస్థాయి క్రీడాపోటీలకు ఎంపిక

పాలకుర్తి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : పాలకుర్తి మండల పరిధిలోని బసంత్‌నగర్ ఐఏఎస్ పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి సీఎం కప్ బేస్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల కోచ్ ఎమ్ క్రిష్ణమూర్తి గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. పెసరి అక్షిత్, కె సాయి ప్రణవ్, బి అక్షయ్, ఇ శరత్, ఎమ్ అంజన్‌సాయి గౌడ్, సజ్జన్ యాదవ్, పి సాత్విక్, డి నిక్షయ్, నాని అంబేద్కర్ తదితరులు ఈనెల 19 నుంచి 22వ తేదీ వరకు హైదరాబాద్ గచ్చిబౌలి క్రీడా మైదానంలో జరిగే పోటీల్లో పాల్గొననున్నట్లు ఆయన తెలిపారు. ఎంపికైన విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్ మహేంద్రన్, కేశోరాం సిమెంట్ కంపెనీ యాజమాన్యం, ఉపాధ్యాయులు, సిబ్బంది, అభినందించారు.

ఉచిత మెగా వైద్య శిబిరం

సుల్తానాబాద్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సుద్దాలకు చెందిన అవిరినేని శ్రీకాంతరావు ప్రస్తుతం మంచిర్యాలలో డాక్టర్ పని చేస్తున్నారు. తన స్వగ్రామానికి ఉపకారం చేయాలని భావించిన డాక్టర్ శ్రీకాంత్‌రావు-దివ్య దంపతులు గురువారం సుద్దాల గ్రామంలోని పాల డెయిరీ ఆవరణలో మెగా ఉచితవైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయించారు. మూడు వందల మందికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేశారు. వైద్య శిబిరాన్ని గ్రామానికి చెందిన మార్కెట్ కమిటీ చైర్మన్ మినుపాల ప్రకాష్‌రావు ప్రారంభించారు. చందర్‌రావు, భారతమ్మ, గోపాల్‌రావు, శ్రీనివాస్‌రావు, తిరుపతిరావు, సుజాత, స్రవంతి, వేణుగోపాలరావు ఆర్వీరావు, స్వప్న, తదితరులు పాల్గొన్నారు.

● ధర్మారం (ఆంధ్రజ్యోతి) : ఐఏఎస్ అధికారి పరికిపండ్ల నరహరి ఏర్పాటు చేసిన ఆలయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. హైదరాబాద్‌లోని శంకర ఐ హాస్పిటల్ ఇన్‌చార్జ్ రామ్ ఆధ్వర్యంలో 300 మందికి కంటి పరీక్షలు నిర్వహించామని, కంటి సమస్యలు ఉన్న 150మందిని హైదరాబాద్ నార్సింగ్‌లోని శంకర ఐ విజన్ సెంటర్‌కు పంపించి చికిత్స అందిస్తామని ఫౌండేషన్ సీఈవో తీట్ల రమేష్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ఇన్‌చార్జ్‌లు మిట్టపల్లి రాజేందర్ కుమార్, కీర్తి నాగార్జున, మామిడిశెట్టి శ్రీనివాస్, గోపతి జనార్ధన్, ముంగల మహేష్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం కప్ జిల్లా స్థాయి రెజ్లింగ్, జూడో పోటీలు

సుల్తానాబాద్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్‌లో జిల్లా స్థాయి రెజ్లింగ్, జూడో పోటీలను మున్సిపల్ చైర్‌పర్సన్ గాజుల లక్ష్మీ రాజమల్లు ప్రారంభించారు. గురువారం స్థానిక ఇండియన్ పబ్లిక్ స్కూల్ లో పెద్దపల్లి జిల్లా క్రీడాశాఖ, రెజ్లింగ్, జూడో సంఘాల ఆధ్వర్యంలో ఈ జిల్లా స్థాయి పోటీలు నిర్వహించారు. ప్రతిభచూపిన క్రీడాకారులను రాష్ట్ర స్థాయికి ఎంపిక చేస్తారని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో క్రీడాభివృద్ధి అధికారి సురేష్, జూడో సంఘం జిల్లా అధ్యక్షులు మాటేటి సంజీవ్ కుమార్, సిలివేరి మహేందర్, వంశీ తదితరులు పాల్గొన్నారు.



జూడో పోటీలో తలపడుతున్న క్రీడాకారులు

హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ అధికారులకు సన్మానం

పెద్దపల్లిటౌన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ విభాగానికి చెందిన ఉన్నతశ్రేణి అధికారులను జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాడూరి శ్రీమన్నారాయణ సన్మానించారు. అధికారిక పర్యటన నిమిత్తం జిల్లా కేంద్రం వచ్చిన వారిని స్వాగతించి సన్మానించారు. ఈసందర్భంగా జనరల్ మేనేజర్ క్వాలిటీ కంట్రోల్ డివిజన్‌లో పనిచేస్తున్న ఏఎస్ రమేష్‌తోపాటు కేంద్ర ప్రభుత్వ సర్వీస్‌లో పనిచేస్తున్న అడిషనల్ చీఫ్‌ఇంజనీర్ ఎం.కె.జా, డీజీఎం జలమండలి అబ్దుల్ సత్తార్‌ను జాతీయ బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి తాడూరి శ్రీమన్నారాయణ బుధ వారంరాత్రి సత్కరించి పూలమాలలతో ఘనంగా సన్మానించారు. శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి హైదరాబాద్ నగర ప్రజలకు మంచి నీటి సరఫరా జరుగుతుందని అంతర్గత పైపులైను పరిశీలన నిమిత్తం జిల్లా కేంద్రంలో పర్యటించారన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ యువజన సంఘ కోఆర్డినేటర్ ఆకుల స్వామి వివేక్ పటేల్‌తో పాటు జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కందుకూరి సత్యనారాయణ, బీసీ సంఘం నాయకులు గొల్లపల్లి రమేష్, తాడూరు వివేక్, తిరుపతి, రహీం, శివ తదితరులు పాల్గొన్నారు.

'ఎల్లంపల్లి' భూములు కబ్జా

(5వ పేజీ తరువాయి)


చేపల చెరువులకు కరెంటు తీసుకునేది ఈ ఉచిత విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల నుంచే..

సెంటర్ల వ్యర్థాలను తీసుకెళ్లి ఆయా చెరువుల్లోని చేపలకు వేస్తున్నారు. వర్షాకాలం ప్రాజెక్టు నిండుగా ఉన్నప్పుడు బ్యాక్ వాటర్ చేపల చెరువుల్లోకి రాకుండా కట్టలు వేశారు. ప్రాజెక్టులో నీళ్లు దూరం వెళితే ప్రాజెక్టులోనే నరాసరిగా పంపులు వేసి చేపల చెరువుల్లోకి నీరు నింపుతున్నారు. ప్రాజెక్టులో 16 టీఎంసీల నీరు ఉంటే చేపల చెరువుల వరకు నీటి ఒత్తిడి ఉంటుంది. దీంతో చెరువులకు నీళ్లు నింపుకోవడం నిర్వాహకులకు సులభం అవుతున్నది. 16 టీఎంసీల కంటే నీటి నిల్వ తగ్గితే ప్రాజెక్టు లోపలి వరకు వేసిన పైప్‌లైన్ల ద్వారా నీళ్లు పంప్ చేసుకుంటున్నారు. వేసవిలో ప్రాజెక్టు నీటి సామర్థ్యం తక్కువగా ఉంటుందని కనుక రెండవ పంటకు, మూడవ పంటకు నీటి ఎద్దడి ఏర్పడకుండా అరకిలో మీటర్ వరకు ప్రాజెక్టు లోపలికి పైపులైను వేసి ఉంచారు. అంతటి దీర్ఘకాలిక ప్రణాళికతో దందా కొనసాగుతున్నది.

● పట్టించుకోని ఇరిగేషన్ అధికారులు

శ్రీపాద ప్రాజెక్టు భూ సేకరణ ద్వారా తీసుకున్న 200 నుంచి 300 ఎకరాల్లో ఐదేళ్లుగా ఇంత భారీగా చేపల చెరువుల నిర్మాణం జరిగినా ఇరిగేషన్ అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. చేపల చెరువు పక్కనే ముర్మూర్ భారీ పంపు హౌస్ ఉన్నది. రామగుండంలోనే శ్రీపాద ప్రాజెక్టు ఇరిగేషన్ విభాగం డివిజనల్ ఇంజనీర్ కార్యాలయం ఉంది. అయినా ఎవరూ చేపల చెరువుల నిర్వాహకులను అడ్డుకోవడం లేదు. తమకు ఏమి కాదని, అందరు అధికారులతో మాట్లాడుకున్నామని చేపల చెరువుల నిర్వాహకులు బహిరంగంగానే చెబుతున్నారు.

● చేపల చెరువులకు ఉచిత కరెంటు..

కోట్ల రూపాయల వ్యాపారం చేస్తున్న ఈ చేపల చెరు వుల వ్యాపారులకు విద్యుత్‌శాఖ అధికారులు సైతం సహకరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ప్రాజెక్టు పరిసరా ల్లో ఉన్న రైతుల భూములకు ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న కరెంటును ఈ చేపల చెరువుల నిర్వాహకులు యథేచ్ఛగా వాడుకుంటున్నారు. స్టార్టర్లు పెట్టుకుని త్రీఫేస్ కరెంటును వాడుకుంటున్నారు. విద్యుత్ వైర్లు ప్రాజెక్టు నీటిలోనే తేలియాడుతున్నాయి. ఇంత జరుగుతున్నా శ్రీపాద ప్రాజెక్టు ప్రాంత విద్యుత్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు ఉంటున్నారు.

● రైతులను అడ్డంపెట్టుకుని దందా..

ప్రాజెక్టు కోసం సేకరణ చేసిన భూముల పక్కనే పట్టా భూమి ఇప్పటికీ కలిగి ఉన్న రైతులు రూ.20వేలకు ఎకరం చొప్పున చేపల చెరువులకు లీజుకు ఇస్తు న్నారు. రూ.10 వేలు కౌలు రాని పరిస్థితుల్లో ఎకరాకు రూ.20 వేలు చేపల చెరువుల వ్యాపారులు ఇవ్వడంతో ప్రాజెక్టు ముంపు ప్రాంతం పక్కన ఉన్న పట్టా భూముల రైతులు ఈ బేరానికి ఒప్పుకుంటున్నారు. 20 ఎకరాల్లో చేపల చెరువు చేసే వ్యాపారి ఒకటి రెండు ఎకరాలు రైతులవి లీజుకు తీసుకుని మిగిలిన 90 శాతం చేపల చెరువులను ప్రాజెక్టు భూముల్లోనే ఏర్పాటు చేస్తున్నారు. ఈ విషయమై 'ఆంధ్రజ్యోతి' రామగుండం చీఫ్ ఇంజనీర్ సుధాకర్‌రెడ్డిని ఫోన్‌లో వివరణ కోరగా, శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులో ప్రాజెక్టు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో భూములను ఆక్రమించి చేపల చెరువులను నిర్మించి నట్టు తమ దృష్టికి రాలేదని, ఎలాంటి ఫిర్యాదులు అందలేదని తెలిపారు. ఎవరైనా ఫిర్యాదులు చేస్తే చర్యలు చేపడుతామని పేర్కొన్నారు.

ఎమ్మెల్యే చిత్రపటానికి క్షీరాభిషేకం

కోల్‌సిటీ, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీల్లో పని చేస్తున్న పారిశుధ్య కార్మికుల సమస్యలపై అసెంబ్లీలో ప్రశ్నించిన రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ చిత్రపటానికి మాదిగ మిత్రమండలి ఆధ్వర్యంలో గురువారం క్షీరాభిషేకం నిర్వహించారు. గోదావరిఖని బస్టాండ్ సమీపంలోని మిత్రమండలి కార్యాలయంలో బుషిపాక సంతోష్ ఆధ్వర్యంలో మాదిగ మిత్రమండలి రాష్ట్ర ఉపాధ్యక్షులు కోటగిరి పాపయ్య పారిశుధ్య కార్మికులతో ఈ కార్యక్రమం నిర్వహించారు. కొట్టెపల్లి దుర్గాప్రసాద్, పంగ రాజయ్య, ఇరుగురాళ్ల సంతోష్, నర్సయ్య, ఓదెలు, రాజమౌళి, దాసరి ఎల్లయ్య, నర్సయ్య, కర్రావుల ఓదెలు, ప్రభుదాస్, హన్మంతు పాల్గొన్నారు

రాష్ట్రంలో క్రీడాకారులకు ఉజ్వల భవిష్యత్తు


మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వేణు

సుల్తానాబాద్, డిసెంబరు 19:(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో క్రీడాకారులకు ఉజ్వల భవిష్యత్తు ఉందని అదనపు కలెక్టర్ వేణు అన్నారు. సుల్తానాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్న జిల్లాస్థాయి సీఎం కప్ క్రీడా పోటీలను అదనపు కలెక్టర్ గురువారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్రీడలు ఆత్మ విశ్వాసాన్ని, దేహ దారుడ్యాన్ని పెంపొందిస్తాయన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గాజుల లక్ష్మీరాజమల్లు, ఇంటర్మీ డియట్ జిల్లా నోడల్ అధికారి కల్పన, జిల్లా యువజన క్రీడల అభివృద్ధి శాఖ అధికారి వై సురేష్, మార్కెట్ కమిటీ చైర్మన్ మినుపాల ప్రకాష్‌రావు, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ బిరుదు సమత క్రిష్ణ, తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు ముస్త్యాల రవీందర్, అమిరిశెట్టి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

పట్టుదల, క్రమశిక్షణతో విజయం

కాల్వశ్రీరాంపూర్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : పట్టుదల, క్రమశిక్షణతో విజయం సాధిస్తారని ఎస్సై వెంకటేష్ విద్యార్థులకు సూచించారు. గురువారం వేదవ్యాస ఉన్నత పాఠశాల విద్యార్థులు పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఎస్సై వెంకటేష్ విద్యార్థులకు పోలీస్ వ్యవస్థలో గల విభాగాలు, అధికారుల విధుల గురించి చాలా వివరించారు. సొసైటీలో జరుగుతున్న పలు మోసాల పట్ల ఎలా అప్రమత్తంగా ఉండాలో తెలుపుతూ సూచనలు ఇచ్చారు. విద్యార్థులు సెల్ అసలే వాడొద్దని అన్ని అనర్థాలకు సెల్ ఫోన్ కారణమని ఇది తల్లిదండ్రులు గుర్తించాలన్నారు. హెడ్‌కానిస్టేబుల్ రజని, కరస్పాండెంట్ జూపాక సౌమ్యమహేష్, ప్రిన్సిపాల్ కోట సదయ్య తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు దుప్పట్ల పంపిణీ


దుప్పట్లు పంపిణీ చేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

ధర్మారం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) లయన్స్ క్లబ్ అధ్యక్షుడు తలమక్కి రవీందర్ శెట్టి ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులకు దుప్పట్లు పంపిణీ చేశారు. రీజినల్‌చైర్మన్ తన్నీరు రాజేందర్, జోన్ చైర్మన్ డాక్టర్ కామణి శ్రీనివాస్, డిస్ట్రిక్ చీఫ్ కో-ఆర్డినేటర్ సామ ఎల్లారెడ్డి, ట్రెజనర్ కట్ట రమేష్, వైస్ ప్రెసిడెంట్ తిప్ప మల్లేశం, సభ్యులు ఈగం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

● పెద్దపల్లిటౌన్ : ప్రభుత్వ ఐటీఐ గ్రౌండ్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భిక్షాటకులు, నిరుపేదలకు గురువారం దుప్పట్లు పంపిణీ చేశారు. అధ్యక్షుడు కొట్టె లక్ష్మయ్య మాట్లాడుతూ అసోసియేషన్ సభ్యులైన కైలాస నరేష్, కోల మృత్యుంజయం, నాళ్ల శ్రీధర్, గుర్రాల రాజుల నుంచి సేకరించిన ఆర్థిక సహాయంతో దుప్పట్లు అందజేసినట్లు తెలిపారు. అన్నేడి వెంకటరెడ్డి, కార్యదర్శి చింతపండు రాజమల్లు, గుంటి కుమారస్వామి, గండు వెంకటేశం, వైద దశరధ్, జయపాల్ పాల్గొన్నారు.



లేడీస్ క్లబ్ ఆధ్వర్యంలో మహిళలకు ఆటల పోటీలు


పోటీలను ప్రారంభిస్తున్న సేవా అధ్యక్షురాలు అలివేణి

రామగిరి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): సింగరేణి ఆర్జీ-3 డివిజన్ పరిధి సీఎస్‌సీవోఏ క్లబ్‌లో గురువారం లేడీస్ క్లబ్ ఆధ్వర్యంలో మహిళలకు ఆటల పోటీలను నిర్వహించారు. సేవా అధ్యక్షురాలు అలివేణి సుధాకర్‌రావు, విజయలక్ష్మి వెంకటేశ్వర్లు ముఖ్యఅతిథిలుగా హాజరై పోటీలను ప్రారంభించారు. గనులు, డిపార్టుమెంట్లలో మహిళా ఉద్యోగులకు పోటీలను నిర్వహించారు. వేర్వేరుగా జరిగిన కార్యక్రమాల్లో ఎస్‌వోటూ జీఎం రఘుపతి, క్లబ్ కార్యవర్గ సభ్యు లు హరిణి, కోమలి, ప్రసన్న, లావణ్య, కోఆర్డినేటర్ సుధాకర్, నిర్వాహకుడు నాగ రాజు తదితరులు పాల్గొన్నారు.

రేపు న్యూమారేడుపాకలో వైద్య శిబిరం

యైటింక్లయిన్‌కాలనీ, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): న్యూమారేడుపాక గ్రామంలో సింగరేణి ఆధ్వర్యంలో ఈనెల 21న ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు ఆర్జీ-2 అధికార ప్రతినిధి అనిల్‌కుమార్ ప్రకటనలో పేర్కొన్నారు. వకీల్‌పల్లె గనికి సంబంధించి జరిపిన ప్రజాభిప్రాయ సేకరణలో వచ్చిన అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుని రేమేడియేషన్ మేషర్స్ కింద ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు అనిల్‌కుమార్ తెలిపారు. వకీల్‌పల్లె ప్రభావిత గ్రామమైన న్యూమారేడుపాక ప్రజల సౌకర్యార్థం 21వ తేదీ ఉదయం 9 గంటల నుండి తెలుగుతల్లి విగ్రహం వద్ద సింగరేణి వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు. ప్రజలు ఈవైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని అనిల్‌కుమార్ ప్రకటనలో పేర్కొన్నారు.

ఆకట్టుకున్న వెల్‌బేబీ షో


ఏరియా హాస్పిటల్‌లో జరిగిన వెల్‌బేబీ షోలో పాల్గొన్న చిన్నారులు


సెక్టార్-3 డిస్పెన్సరీలో వెల్ బేబీషో..

గోదావరిఖని, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): సింగరేణి ఆవిర్భావ వేడుకల సందర్భంగా స్థానిక ఏరియా హాస్పిటల్‌లో గురువారం వెల్‌బేబి షో పోటీలు నిర్వహించారు. ఆర్‌జీ-1 సేవా అధ్యక్షురాలు అనిత లలిత్‌కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు.

ఈ కార్యక్రమంలో ఎస్‌ఓటూ జీఎం గోపాల్‌సింగ్, డీజీఎం పర్సనల్ కిరణ్‌బాబు, ఏసీఎంవో కిరణ్‌రాజ్ కుమార్, ఏఐటీయూసీ నాయకులు స్వామి, మడ్డి ఎల్లయ్య, ఆరెల్లి పోషం, సేవా సెక్రటరి శిరీష, సేవా జాయింట్ సెక్రటరి బీన సింగ్, చిలుక లక్ష్మి, నీరజ కిరణ్‌రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

● యైటింక్లయిన్‌కాలనీ (ఆంధ్రజ్యోతి): ఆర్జీ-2 యాజమాన్యం గురువారం సెక్టార్-3 డిస్పెన్సరీలో వెల్ బేబీషో నిర్వహించింది. జీఎం బండి వెంకటయ్య ముఖ్యఅతిథిగా హాజరై షోను ప్రారంభించారు. వివిధ వేషధారణ, వస్త్రధారణలతో చిన్నారులు ఆకట్టుకున్నారు. ఏఐటీయూసీ బ్రాంచి సెక్రెటరీ జిగురు రవీందర్, ఎస్వోటూ జీఎం రాముడు, డీజీఎం పర్సనల్ అనిల్‌కుమార్, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ మహిపాల్, పర్యావరణ అధికారి వేణు, డాక్టర్ పద్మ, డాక్టర్ సాహితి పారామెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

జీడీకే 1ఇంక్లైన్‌లో దుర్గామాత ఆలయ వార్షికోత్సవం

గోదావరిఖని, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆర్‌జీ-1 ఏరియా జీడీకే 1,3 ఇంక్లైన్‌లో గురువారం శ్రీ దుర్గ దేవి అమ్మవారి వార్షికోత్సవాల సందర్భంగా ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ వేడుకలకు ఆర్‌జీ-1 జీఎం లలిత్ కుమార్, సేవా అధ్యక్షురాలు అనిత లలిత్ కుమార్ హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ గనిపై కొలువైన శ్రీ దుర్గ దేవి అమ్మవారు చల్లని దీవెనలతో ఉద్యోగులందరిపై కృప కటాక్షాలు ఉండాలని కోరారు. ఇదే స్ఫూర్తితో అందరూ కలిసికట్టుగా ఐక్యతగా ఉంటూ కలిసి పనిచేస్తూ సంస్థ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. అమ్మవారి అనుగ్రహం ప్రతి ఒక్క ఉద్యోగిపై ఉండాలని, అదేవిధంగా సంస్థ నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాలను రక్షణతో సాధించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో ఏజెంట్-1 గ్రూప్ రమేష్, దాసరి వెంకటేశ్వర్‌రావు, చంద్రశేఖర్, నాగేశ్వర్‌రావు, చిలక శ్రీనివాస్, ఏఐటీయూసీ నాయకులు స్వామి, మడ్డి ఎల్లయ్య, ఆరెల్లి పోషం, డీజీఎం పర్సనల్ కిరణ్ బాబు, మేనేజర్ రమేష్, పర్సనల్ అధికారులు రవీందర్‌రెడ్డి, సారంగపాణి, హనుమంతరావు, శ్రవణ్ కుమార్, ఇక్బాల్ షరీఫ్, అధిక సంఖ్యలో ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రాథమిక విద్య పటిష్టానికి కృషి : కలెక్టర్

పెద్దపల్లి కల్చరల్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలో ప్రాథమిక విద్య బలోపేతం చేసేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. గురువారం కలెక్టర్ కోయ శ్రీహర్ష విద్యాశాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులతో కలెక్టరేట్‌లో నిర్వహించిన రివ్యూ సమావేశంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ ప్రాథమిక విద్యను జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో పటిష్టం చేసేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని, విద్యార్థులలో పఠనం, గణిత సామర్థ్యాలు పెంచాలని తెలిపారు. విద్యార్థులలో సామర్థ్యాలను పెంచుటకు మధ్యాహ్నం షెడ్యూల్‌లో ఏడు, ఎనిమిది పీరియడ్స్‌ను రిమీడియట్ బోధనను నిర్వహించాలని అన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి డి. మాధవి, జిల్లా సమగ్ర శిక్ష సమన్వయకర్త పిఎం షేక్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

సమాధులు ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి


బాధితుడు పిల్లి భూమయ్య

జూలపల్లి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : తన తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులకు చెందిన సమాధులను(గోరీలను) చీమలపేటకు చెందిన తొంటి బీరయ్య మూడు నెలల క్రితం ధ్వంసం చేసిన విషయమై పోలీసులకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోవడం లేదని మండలంలోని తెలుకుంటకు చెందిన పిల్లి భూమయ్య అనే వ్యక్తి ఆరోపించాడు. తెలుకుంట సమీపంలో ఉన్న ప్రభుత్వ భూమి సర్వేనెంబరు 1396లో గ్రామస్థులతో పాటు తమ కుటుంబ సభ్యుల సమాధులు ఉన్నాయని, బీరయ్య ట్రాక్టర్‌తో ధ్వంసం చేసి, ఆనవాల్లు లేకుండా చేశాడని బాధితుడు భూమయ్య ఆవేదన వ్యక్తం చేశాడు. తహసీల్దార్‌కు సైతం ఫిర్యాదు చేశానని, అధికారులు స్థలాన్ని పరిశీలించి ప్రభుత్వ భూమిగా రిపోర్టు ఇచ్చినా పోలీసులు పట్టించుకోకుండా కాలయాపన చేస్తున్నారని ఆరోపించాడు.

సమాధులను కూల్చడం సమంజసం కాదు..

- గొడిసెల రవి, మాజీ సర్పంచ్, తెలుకుంట



ఎన్నో ఏళ్లుగా గ్రామ ప్రజలు సమీపంలోని ప్రభుత్వ భూమిలో సమాధులు(గోరీలను) నిర్మించుకుంటున్నారు. భూమి తనదేనంటూ తొంటి బీరయ్య సమాధులను కూల్చివేయడం సమంజసం కాదు. గతంలో గ్రామ పంచాయతీ నుంచి సమాధుల కోసం తీర్మానం కూడా ఇచ్చాం. ఇది గ్రామ ప్రజలందరి ఉమ్మడి ఆస్తి.